

తవ్వేశారు.. వదిలేశారు!

- నిధులు లేకుండా కుమ్మమూరు పాత డీపీ తొలగింపు
- బందరు కాలువకట్టకు రెండు వైపులా తవ్వకాలు
- ఇప్పుడు దాతల కోసం ఎదురు చూపులు
- నీటి విడుదలతో పొంచి ఉన్న ప్రమాదం
- ఇరిగేషన్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

తోట్లవల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల వ్యయం అయ్యే ఇరిగేషన్ వర్క్‌ను రూపాయి మంజూరు లేకుండా అధికారులు చేపట్టేందుకు చేసిన ప్రయత్నం విమర్శలకు తావిస్తోంది. తోట్లవల్లూరు బందరు కాలువ పాత వంతెన సమీపంలో కుమ్మమూరు పంట పొలాలకు సాగునీరందించే డీపీ(డిస్ట్రిబ్యూషన్ పాయింట్) ఉంది. ఇది అనేక సంవత్సరాల క్రితం పాడైపోయింది. దీనిని పునర్నిర్మించాలని రైతులు చాలా కాలంగా అధికారులను కోరుతున్నారు. అర్జీల రూపంలో సమస్యను తెలియజేశారు. వర్క్ అంచనా వేసి ప్రభుత్వానికి పంపినా నిధులు మంజూరు కావటం లేదని అధికారులు చెపుతుండేవారు. అయితే నాలుగు రోజుల క్రితం ఇరిగేషన్ అధికారులు యంత్రం తీసుకొచ్చి పాత డీపీని కట్టకు రెండు వైపులా తొలగించారు. తొలగించిన తర్వాత దాతల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకుండా, టెండర్ లేకుండా, లక్షలు ఖర్చయ్యే పెద్ద వర్క్‌ని ఎలా చేస్తారో ఆలోచన లేకుండా పాత డీపీని తొలగించటంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. డీపీ నిర్మాణం కోసం రైతులను డబ్బులు అడుగుతున్నట్లు తెలిసింది. మరోవైపు మిగతా 6లో..

కేంద్ర ప్రభుత్వం జిల్లాపై అమృత ధారలు కురిపించింది. తాగునీటి పథకాలు, చెరువుల అభివృద్ధికి మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్, గుడివాడ పురపాలక సంఘానికి కలిపి రూ.189.38 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టే పనులకు రెండు వారాల్లోపు టెండర్లు పిలిచే అవకాశం కనిపిస్తోంది. ఇక ప్రజల తాగునీటి సమస్యలు త్వరలో తీరిపోనున్నాయి.


మచిలీపట్నం నగరం

అమృత ధారలు

అమృత్ 2.0 పథకంలో మచిలీపట్నం, గుడివాడకు రూ.189.38 కోట్లు మంజూరు

- మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌కు రూ.73.38 కోట్లు విడుదల
- గుడివాడ పురపాలక సంఘానికి రూ.116 కోట్లు కేటాయింపు
- రెండు వారాల్లోపు పనులకు టెండర్లు పిలిచే అవకాశం
- తాగునీటి సరఫరా, డ్రెయిన్లు, చెరువుల అభివృద్ధికి వినియోగించనున్న నిధులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌కు అమృత్ 2.0 పథకం కింద రూ.73.38 కోట్ల నిధులను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని తాగునీటి చెరువు ఆధునీకీకరణకు రూ.2.76 కోట్లు, సబ్‌జైలు అవుట్‌ఫాల్ డ్రెయిన్, ఫతుల్లాబాద్ అవుట్ ఫాల్ డ్రెయిన్ చివరి పాయింట్లలో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు 5ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించేందుకు రూ.53.10 కోట్లు విడుదల చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.12.16 కోట్లను కేటాయించాల్సి ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.32 కోట్లను జమచేయాలి. దీంతో పాటు కార్పొరేషన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయిన్‌ల నిర్మాణానికి రూ.1.16 కోట్లను కేటాయించింది. నీటి ఇబ్బందులు ఉన్న వివిధ కాలనీల్లో తాగునీటి వసతులను మెరుగుపరిచేందుకు రూ.1.12కోట్లు విడుదల చేసింది. మచిలీపట్నంలో తాగునీటి పైప్‌లైన్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, ఇతరత్రా అవసరాల కోసం రూ.15.24 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, అమృత్ 2.0 పథకం నిధులతో పనులు చేపట్టేందుకు రెండు వారాల వ్యవధిలో టెండర్లు పిలుస్తారని మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు తెలిపారు.

గుడివాడలో తాగునీటి సమస్యలకు చెక్

గుడివాడ పురపాలక సంఘానికి అమృత్ 2.0 పథకం కింద మొత్తం రూ.116 కోట్లను విడుదల చేసింది. ఇంటింటికీ తాగునీరు పూర్తిస్థాయిలో అందించేందుకు, తాగునీటి వ్యవస్థను మెరుగు పరిచేందుకు రూ.52.74 కోట్లు, బేతవోలులోని ఊరచెరువును అభివృద్ధి చేసేందుకు రూ. 2.09 కోట్లు, నాగన్నచెరువు అభివృద్ధికి రూ.2.09 కోట్లు, 25వ వార్డులోని పాత, కొత్త సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పునర్నిర్మించేందుకు రూ.5.61 కోట్లు కేటాయించింది. గుడివాడ పురపాలక సంఘంలోని కాలనీల్లో తాగునీటి వసతిని మెరుగు పరిచేందుకు రూ.10 కోట్లు, వివిధ అభివృద్ధి పనుల కోసం మిగతా నిధులను విడుదల చేసింది.

వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో అమృత్ పథకంతో పాటు, ఇతర అభివృద్ధి పనుల అంచనాలు మిగతా 6లో..

హై డ్రామా!

తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో వైసీపీ మైండ్‌గేమ్

- ఎన్నిక రద్దు కావడానికి శతవిధాలా ప్రయత్నాలు
- వైసీపీ కౌన్సిలర్లను విజయవాడలో దాచి కట్టుకథలు
- పోలీసులు అడ్డుకుంటున్నారంటూ ఈసీకి ఫిర్యాదు
- ఈసీ ఆదేశాలు పట్టించుకోవట్లేదంటూ హైకోర్టులో కేసు
- వైసీపీ నాయకుడు అవినాశ్ ఆధ్వర్యంలో తిరువూరులో హడావిడి
- ఎక్కడికక్కడ అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- ఈ తతంగంతో ముగిసిన ఎన్నిక సమయం.. రద్దు
- చివరి నిమిషంలో వైసీపీ కౌన్సిలర్ల సమాచారం లీక్
- ఎస్కార్టుతో తిరువూరు తరలించిన పోలీసులు

తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రద్దే లక్ష్యంగా వైసీపీ డబుల్ గేమ్ ఆడింది. ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లను బయటకు రానీయకుండా నగరంలోని ఓ హోటల్‌లో దాచి ఉంచిన నాయకులు.. తమ వారిని పోలీసులు అడ్డుకుంటున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలను పోలీసులు అమలు చేయట్లేదంటూ మంగళవారం హైకోర్టులో కేసు వేసి విషయాన్ని పక్కదారి పట్టించారు. ఓవైపు ఎన్నిక జరగనివ్వట్లేదని ఆరోపిస్తూనే, మరోవైపు ఎన్నిక రద్దయ్యేలా మైండ్‌గేమ్ ఆడారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తిరువూరు మున్సిపాలిటీలో సంఖ్యాపరంగా వైసీపీకి-17, టీడీపీకి-3 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అయితే, వైసీపీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు టీడీపీకి టచ్‌లోకి వచ్చారు. దీంతో వైసీపీ బలం 12కు పడిపోయింది. మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు బయటకు రాకపోయినా టీడీపీకే మద్దతు ప్రకటిస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో టచ్‌లో ఉన్నారు. దీంతో వైసీపీకి పదిమంది మద్దతు మాత్రమే ఉంది. ఈ పదిమందిలో ఒక కౌన్సిలర్ అమెరికాలో ఉన్నారు. ఎన్నికకు రాలేదు. దీంతో ఆ పార్టీ బలం 9. టీడీపీ బలం.. ముగ్గురు కౌన్సిలర్లతో పాటు మద్దతు వచ్చిన ఐదుగురితో కలిపి మొత్తం 8కి చేరింది. మరో ఇద్దరు సభ్యులు టచ్‌లో ఉండటంతో టీడీపీకి 11 మంది సభ్యుల మద్దతు లభించినట్లైంది. ఫలితంగా తిరువూరు మున్సిపల్ పీఠం టీడీపీ వశమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎలాగైనా ఎన్నికను నిలుపుదల చేయాలని వైసీపీ నాయకులు మైండ్‌గేమ్ ఆడారు. సమావేశం ఉంది.. రమ్మనిచెప్పి కౌన్సిలర్లకు ఆహ్వానం పలికి, నగరంలోని ఓ హోటల్‌లో ఉంచారు. వారి సెల్‌ఫోన్లు తీసుకుని మరీ కమ్యూనికేషన్ లేకుండా చేశారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో టచ్‌లోకి వచ్చిన ఇద్దరు కౌన్సిలర్లు కూడా ఇక్కడే ఉండిపోయారు.

వైసీపీ మైండ్‌గేమ్

నిన్న అలా : తమ పార్టీకి చెందిన కౌన్సిలర్లను టీడీపీ నాయకులు పోలీసుల సహాయంతో అడ్డుకుంటున్నారంటూ వైసీపీ నాయకులు సోమవారం డ్రామా సృష్టించారు. ఎన్నికల సంఘం అధికారిణి నీలం సాహ్నికి ఫిర్యాదు చేశారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లకు రక్షణ కల్పించాలని, వారిని కౌన్సిల్ లోపలి వరకు పోలీసు భద్రత నడుమ తీసుకెళ్లాలని ఆమె సోమవారం ఉదయమే ఆదేశాలిచ్చారు. కానీ, సోమవారం వైసీపీ కౌన్సిలర్లు ఎన్నికకు రాలేదు. దీంతో కోరం లేక ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది. కౌన్సిలర్లను అందరినీ విజయవాడలోనే ఓ హోటల్‌లో ఉంచి, ఏమీ తెలియనట్టుగా సోమవారమే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ తిరువూరు వెళ్లి హడావిడి చేశారు.

నేడు ఇలా : దేవినేని అవినాశ్ మంగళవారం మరో ఎత్తుగడ వేశారు. ఎన్నికల సంఘం మిగతా 6లో..


ఖాళీగా దర్శనమిస్తున్న కౌన్సిలర్ సీట్లు

తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రద్దు

- కోరం లేకపోవటంతో రద్దు చేసిన ఎన్నికల అధికారులు
- వైసీపీ సభ్యులంతా గైర్హాజరు
- టీడీపీకి మద్దతుగా ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు

తిరువూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రద్దైంది. మంగళవారం జరిగిన ఎన్నికకు సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో ఎన్నిక రద్దు చేస్తున్నట్లు ఎన్నికల అధికారిణి, ఆర్డీవో కె.మాధురి ప్రకటించారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సమావేశ మందిరంలో ఆమె సభ్యుల కోసం వేచి చూశారు. గడువు ముగిశాక కూడా టీడీపీ, వైసీపీ సభ్యులు రాకపోవడంతో రద్దు మిగతా 6లో..

పెనమలూరు సర్పంచ్ లింగాల భాస్కరరావుపై

3 నెలల సస్పెన్షన్ వేటు

- ఆదేశాలు జారీ చేసిన ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ
- 3 నెలల పాటు సస్పెండ్, చెక్ పవర్ రద్దు
- ఉప సర్పంచ్ శీలం సుమతికి సర్పంచ్ విధులు, చెక్ పవర్ అప్పగింత
- నిబంధనలకు విరుద్ధంగా రూ.55.25 లక్షలతో ఇరిగేషన్ కాలువ కట్టపై సిమెంట్ రోడ్డు
- రూ.63.42 లక్షల పంచాయతీ నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ
- దోషిగా తేలడంతో సర్పంచ్ పదవి నుంచి తొలగింపు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: పెనమలూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ లింగాల భాస్కరరావును విధుల నుంచి జిల్లా యంత్రాంగం సస్పెండ్ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్ కెనాల్ కట్టమీద సిమెంట్ రోడ్డును నిర్మాణం చేసినందుకు ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ సర్పంచ్‌పై వేటు వేశారు. ఇరిగేషన్ కెనాల్ కట్టపై నిబంధనలకు విరుద్ధంగా రూ.55,25,112 మేర బిల్లు చెల్లింపులు, పెనమలూరు గ్రామ పంచాయతీ నిధులు రూ.63,42,912 నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయడంపై ఈ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పెనమలూరు మండలం పెనమలూరు గ్రామపంచాయితీ పరిధిలోని పల్లెపేటలో ఇరిగేషన్ కెనాల్ కట్టపై గ్రామ పంచాయతీ సీసీ రోడ్డు పనులు చేపట్టింది. అయితే ఇరిగేషన్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా సిమెంట్ రోడ్డు పనులు చేపట్టారు. మొత్తం రోడ్డు పనులను 12 భాగాలుగా విభజించి 14వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టే విధంగా సర్పంచ్ ప్రతిపాదించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసిన తర్వాత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.27,47,898, గ్రామ పంచాయితీ సాధారణ నిధులు రూ.27,77,214 వెరసి మొత్తం రూ.55,25,112 లను నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపు జరిపారు. ఈ వ్యవహారంపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా జిల్లా యంత్రాంగం విచారణకు ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టడంతో పాటు నిధులు చెల్లించారని గుడివాడ డివిజనల్ పంచాయతీ అధికారి నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా గ్రామ సర్పంచ్‌కి జిల్లా యంత్రాంగం షోకాజ్ నోటీస్‌ను జారీచేసింది. మార్చి 17వ తేదీన కలెక్టర్ సమక్షంలో విచారణ జరిగింది. ఈ విచారణలో మిగతా 6లో..



ఇంటర్నేషనల్ ఫ్లైట్స్‌తోనే ఎయిర్ కార్గోకు మార్గం!

- డిమాండ్ తేలకుండా కార్గో ఫ్లైట్స్ రావాలంటే కష్టం
- పాసింజర్‌లు నడిపి పరిశీలించాలి
- తర్వాతే డిమాండ్‌పై అవగాహన

6

జాబ్‌మేళాకు భారీగా రాజధాని యువత

సమస్యలపై అధ్యయనానికే క్షేత్రస్థాయి పరిశీలన

6

భారీ వర్షం

- జిల్లాలో అత్యధికంగా పమిడిముక్కలలో 87.2 మిల్లీమీటర్ల వర్షపాతం
- అత్యల్పంగా గన్నవరంలో 10.2 మిల్లీ మీటర్లు నమోదు
- మరో రెండు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు
- జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ


అవనిగడ్డలో రహదారిపై వర్షపునీరు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లావ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8.30 గంటల వరకు వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా పమిడిముక్కలలో 87.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా గన్నవరంలో 10.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 44.3 మిల్లీమీటర్లుగా ఉంది. కోస్తాతీరం వెంబడి రానున్న రెండు రోజుల పాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, పోలీస్, ఎన్‌డీఆర్ ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు సిద్ధంగా ఉండాలని సూచించారు.

రహదారులు జలమయం

భారీ వర్షంతో మచిలీపట్నం, గుడివాడ, పెడన, ఉయ్యూరు, నందివాడ, అవనిగడ్డ, నాగాయలంక తదితర ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభం కాగానే అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుడివాడ తదితర ప్రాంతాల్లో సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వ్యవసాయానికి అనుకూలం

మరో పది రోజుల్లో ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు దుక్కులకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. దుక్కులు పూర్తి చేస్తే భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను పొలంలో చల్లేందుకు అవకాశం ఏర్పడుతుందని అంటున్నారు. జూన్ ప్రారంభం నాటికి రుతుపవనాలు ప్రవేశించి, మరింతగా వర్షాలు కురిస్తే వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా మారుతుందనే ఆశతో రైతులు ఉన్నారు. కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, చల్లపల్లి, మొవ్వ తదితర ప్రాంతాల్లో బోరు నీటి ఆధారంగా మిగతా 6లో..

టీడీపీకి మద్దతు ఇస్తున్న కౌన్సిలర్లను నిర్బంధించారు!

● ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ అభివృద్ధే లక్ష్యంగా టీడీపీకి మద్దతు ఇస్తున్న ఇద్దరు కౌన్సిలర్లను వైసీపీ నాయకులు నిర్బంధించారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో టీడీపీ కౌన్సిలర్లతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 19వ తేదీన జరగాల్సిన ఎన్నిక కోరం లేక మంగళవారానికి వాయిదా పడిందని, అధికారుల సూచనలతో తమ సభ్యులంతా కార్యాలయానికి చేరుకొని, నిర్బంధంలో ఉన్న టీడీపీ సభ్యుల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. సుమారు 10 మంది వైసీపీ కౌన్సిలర్లు అభివృద్ధి లక్ష్యంగా టీడీపీకి మద్దతు ప్రకటించారన్నారు. ఆరుగురు సభ్యులు టీడీపీలో చేరిన అనంతరం, మరో నలుగురు టీడీపీలో చేరుతున్న సమాచారంతో వారిని బెంగళూరు తరలించారని అన్నారు. ఈ సంఘటనపై కేసు పెట్టడం జరిగిందన్నారు. నిర్బంధానికి గురైన సభ్యులు రాగానే వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని, స్వేచ్ఛగా నిర్ణయం తీసుకుని ప్రశాంతంగా చైర్‌పర్సన్ ఎన్నిక జరిగేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కొండపల్లి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే వసంత

త్వరలో కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మరోవారంలో కొండపల్లి మున్సిపాలిటీలో టీడీపీ విజయం సాధిస్తుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. మైలవరంలో జరిగిన మినీ మహానాడు సందర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక త్వరలో జరుగుతుందని, ఇదో మంచి శుభవార్త అని అన్నారు. ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయ్యిందన్నారు. వేదికపై ఉన్న చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబును హర్షధ్వానాల మధ్య ఆయన అభినందించారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఇబ్రహీంపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేయాలని, అధిక లోడు రవాణా చేయరాదని ఆర్ఎస్సై లక్ష్మణరావు సూచించారు. ఏపీ మినీ వ్యాన్ మోటార్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ రాష్ట్ర సదస్సు ఇబ్రహీంపట్నంలోని సీఐటీయు కార్యాలయం వద్ద మంగళవారం జరిగింది. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా ఉండాలని, యూనిఫామ్ ధరించాలన్నారు. సురక్షితమైన డ్రైవింగ్ చేయాలన్నారు. సలహాలు, సూచనలు అందించారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిర్రా నాగరాజు, ఇబ్రహీంపట్నం మండల సీఐటీయు కార్యదర్శి ఎం.మహేష్, సురేష్ వర్మ, రాజమండ్రి వెంకటేశ్వరరావు, అశోక్, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అధికారి నటరాజన్ షణ్ముగాన్ని కలిసి కోదండ రామాలయం పరిస్థితిని వివరిస్తున్న చంద్రగూడెం గ్రామస్థులు

వర్షాల నేపథ్యంలో ఆలయాలపై ప్రత్యేక దృష్టి

వన్‌టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని ఆలయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా దేవదాయశాఖ అధికారి నటరాజన్ షణ్ముగం ఈవోలకు సూచించారు. మైలవరం నియోజకవర్గం చంద్రగూడెం గ్రామంలోని కోదండ రామాంజనేయ దేవస్థానం పైకప్పు నుంచి వర్షపు నీరు ఆలయంలోకి వస్తోందని, వెంటనే అభివృద్ధి చేయాలని ఆలయ ఈవో ఎస్.శ్రీనివాస్, గ్రామ పెద్దలు 20 మంది మంగళవారం గవర్నరుపేటలో దేవదాయశాఖ జిల్లా అధికారి షణ్ముగం వద్దకు వచ్చి ఆలయ పరిస్థితులను వివరించారు. ఉన్నతాధికారులు అనుమతిస్తే గ్రామస్థులమే సొంత నిధులతో దేవస్థానాన్నిఅభివృద్ధి చేస్తామని తెలిపారు. కొద్దిపాటి వర్షానికే ఆలయం వర్షపు నీటితో నిండిపోతుందని, వందేళ్ల క్రితం ఆల యం కావటంతో గోడలు కూడా కూలిపోయే ప్రమాదం ఉందని ఆయనకు వివరించారు. దేవస్థానాన్ని సందర్శించాలని గ్రామస్తులు నటరాజన్ షణ్ముగాన్ని కోరుతూ వినతిపత్రం అందజేశారు. స్పందించిన నటరాజన్ షణ్ముగం రెండు, మూడు రోజుల్లో దేవస్థానానికి విచ్చేసి ఉన్నతాధికారులతో మాట్లాడి అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

ముందస్తుగానే నారుమడులు పోసుకుంటామని రైతులు అంటున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం ఇలా

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. చల్లపల్లి ఆలి 71.8 మిల్లీమీటర్లు, మోపిదేవి 70.2, ఘంటసాల 69.2, పామర్రు 60.6, అవనిగడ్డ 57.4, మచిలీపట్నం 54.2, గుడ్లవల్లేరు 52.6, మొవ్వ 50.8, నాగాయలంక 50.8, గుడివాడ 49.4, ఉయ్యూరు 48.2, బంటుమిల్లి 46.2, కంకిపాడు 44.2, పెదపారుపూడి 43.2, గూడూరు 36.0, నందివాడ 32.4, కోడూరు 31.2, పెనమలూరు 29.4, పెడన 28.8, తోట్లవల్లూరు 26.6, కృత్తివెన్ను 18.2, బాపులపాడు 16.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



గజమాలలతో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు, మాట్లాడుతున్న వసంత



జగ్గయ్యపేట మినీ మహానాడులో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, నెట్టెం, ఎమ్మెల్యే తాతయ్య

2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి

● కార్యకర్తలే టీడీపీ బలం : ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

మైలవరంరూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి పునాది, బలం, శక్తి కార్యకర్తలేనని, 2029 లో కూడా పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. మైలవరం నియోజకవర్గ మినీ మహానాడును మైలవరం వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో మంగళవారం ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాన సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. తెలుగు యువత అధ్యక్షుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వసంతను గజమాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి వెలిగించి మినీ మహానాడును ఆయన ప్రారంభించారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పెహల్గామ్ ఉగ్రదాడి ఘటనలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో పార్టీ పటిష్టత కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటానన్నారు. తనకు ఎలాంటి గ్రూపులు, వర్గాలు లేవన్నారు. గ్రామాల్లో ఆధిపత్య పోరును విడనాడాలన్నారు. ప్రతిఒక్కరూ సానుకూల దృక్పథంతో పనిచేయాలన్నారు. త్వరలో నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందన్నారు. మహిళలకు కూడా 33 శాతం రిజర్వేషన్లు సార్వత్రిక ఎన్నికల్లో అమలు చేస్తారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. టీడీపీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, బొమ్మసాని సుబ్బారావు, కె.విజయబాబు, నర్రా వాసు, ఉయ్యూరు నరసింహారావు, జువ్వారాం బాబు, ముప్పిడి నాగేశ్వరరెడ్డి, వజ్రాల కుమార రెడ్డి, లంకా లితీష్, ఇనుగంటి శోభన్‌బాబు, రాయల లీలాప్రసాద్, మోర్ల రేశా లు, దూరు బాలకృష్ణ, చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టకుదురు శ్రీనివాసరావు, దారు నాయక్ పాల్గొన్నారు.

జగ్గయ్యపేట, నందిగామలో ఇండస్ట్రియల్ క్లస్టర్

● మినీ మహానాడులో ఎంపీ కేశినేని చిన్ని, నెట్టెం

జగ్గయ్యపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట, నందిగామ నియోజక వర్గాల దశదిశ మార్చేలా ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటు కాబోతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ మినీ మహానాడులో వారు పాల్గొని మాట్లాడారు. వైసీపీ అస్తవ్యస్త పాలనతో అధోగతి పాలైన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం చంద్రబాబు నేతృత్వంలో గాడిలో పెట్టడంతో ద్వారా అభివృద్ధిని పట్టాలెక్కిస్తున్నారన్నారు. జగ్గయ్యపేట, నందిగామల్లో రెండు వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ క్లస్టర్ వస్తే పరిశ్రమల స్థాపన జరిగి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. జగ్గయ్యపేటలో ప్రభుత్వ కళాశాలకు డీపీఆర్ సిద్ధమైందని, ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభిస్తారన్నారు. వేదాద్రి, కంచెల ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు విడుదల కానున్నాయన్నారు. కొత్తగా నియమితులైన పార్టీ బాధ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు దొంతు చిన్నా, మండల పార్టీల అధ్యక్షులు కట్టా నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, చింతల సీతారామయ్య, చైర్మన్ రాఘవేంద్ర, తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే అన్ని వర్గాలకు మేలు : చిన్ని



నందిగామ, మే 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీతోనే పేదల అభ్యున్నతి సాధ్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. నందిగామ నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు స్థానిక ఆర్ఎస్ గార్డెన్‌లో మంగవారం జరిగింది. నాలుగు మండలాల కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్టీఆర్ స్ఫూర్తిగా సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనతో కునారిల్లుతున్న రాష్ట్రానికి తిరిగి జీవం పోసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఎస్ఎస్ఎల్‌బీసీ ప్రా జెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, నియోజకవర్గ పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం, కోగంటి బాబు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కం దుల కల్పన, మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజాన్ని సహించం

● గో బ్యాక్ అవినాష్
● అడ్డుకున్న టీడీపీ శ్రేణులు



దేవినేని అవినాష్ వాహనాన్ని అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు

తిరువూరు/ఎ.కొండూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్‌జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను ఎ.కొండూరు మండలం రేపూడి-మాధవరం జంక్షన్ వేపచెట్టు సెంటర్ వద్ద టీడీపీ శ్రేణులు మంగళవారం అడ్డుకున్నారు.

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో, విజయవాడ నుంచి వైసీపీ నాయకులు వస్తున్న సమాచారంతో రామచంద్రాపురం సమీపంలోని బాడవ టోల్‌ప్లాజా వద్దకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. వైసీపీ నాయకుల వాహనాలను అడ్డుకునేందుకు సిద్ధం అయ్యారు. అయితే, వైసీపీ నాయకులు రెడ్డిగూడెం మీదుగా తిరువూరు వస్తుండడంతో టీడీపీ శ్రేణులు ఎ.కొండూరు - విస్సన్నపేట రోడ్డులోని మాధవరం వేపచెట్టు సెంటర్‌వద్ద అవినాష్ ప్రయణిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. వాహనంలో అవినాష్‌తో పాటు ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు ఉన్నారు. మరో నాలుగు వాహనాల్లో దేవినేని అవినాష్ అనుయాయులు ఉన్నారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణు లు వైసీపీ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రశాంతంగా ఉన్న తిరువూరులో అల్లరు సృష్టించి ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసేందుకు వస్తున్నారని, మంగళగిరి టీడీపీ కార్యాలయంపై దాడికేసులో నిందితుడిగా ఉన్న అవినాష్‌కు ఈ ప్రాంతంలో ఏం పని అని ప్రశ్నించారు. ఒక దశలో అక్కడ ఉన్న పోలీసులకు, టీడీపీ శ్రేణులకు పెద్దఎత్తున వాగ్వాదం జరగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సుమారు రెండు గంటలు రోడ్డుమీదే టీడీపీ శ్రేణులు కారు ను అడ్డుకొని గోబ్యాక్ అవినాష్ అంటూ నినాదాలు చేశారు. తిరువూరు, మైలవరం సీఐలు గిరిబాబు, చంద్రశేఖర్, రెడ్డిగూడెం ఎస్సై తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని అవినాష్‌ను తిరిగి వెనక్కు పంపించే ప్రయత్నం చేశారు. అవినాష్ కారును టీడీపీ శ్రేణులు చుట్టుముట్టి కదలకుండా అడ్డుకున్నారు. గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున అరుస్తూ నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు టీడీపీ శ్రేణులను నియంత్రించారు. పోలీసులు అవినాష్‌తో మాట్లాడి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ వాహనంలో మైలవరం తరలిస్తామని చెప్పడంతో కార్యకర్తలు శాంతించారు. అనంతరం అవినాష్‌తో పాటుగా ఇతర నేతలను, పోలీసువాహనంలో ఎక్కించుకొని రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలవాల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ, తిరువూరులో అల్లరు చేసేందుకు వస్తున్న విజయవాడ వైసీపీ శ్రేణుల్ని అడ్డుకున్నామని, తిరువూరులో ఎన్నికలు జరుగుతుంటే విజయవాడ నాయకులకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉండే తిరువూరు ప్రాంతంలో వైసీపీ నాయకుల రౌడీయిజం చెల్లదని, ప్రశాంతతకు భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరించారు. టీడీపీ నాయకులు గడ్డి కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, భీమ్లానాయక్, పిక్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో విష సంస్కృతి తీసుకొచ్చారు : అవినాష్

గుణదల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతమైన తిరువూరులో విష సంస్కృతి తీసుకొచ్చారని, ఈ విషయంలో ప్రశ్నించే పార్టీ ఏమైందని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ కౌన్సిలర్లకు మద్దతుగా వెళ్తే, వందలాది మంది టీడీపీ గూండాలు పోలీసుల సమక్షంలో నీచంగా వ్యవహరించారని ఆరోపించారు. బాటిళ్ల విసిరి బూతులు తిడుతూ దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. తాము ముందుగానే పోలీసులకు చెపితే సరైన రీతిలో స్పందించలేదన్నారు. దారిలో టీడీపీ గూండాలు కాపు కాశారని చెప్పినా పోలీసులు రక్షణ కల్పించలేదని ఆరోపించారు. ఈ విషయంలో మరోసారి ఎలక్షన్ కమిషనర్‌ను కలుస్తామన్నారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఒక పార్టీలో గెలిచి వేరే పార్టీలో చేరిన అభ్యర్థిని చైర్మన్ చేయడమనేది ఎక్కడా లేదన్నారు.



తిరువూరు పోలీస్‌స్టేషన్‌లో దేవినేని అవినాష్

దేవినేని అవినాష్ అరెస్టు, విడుదల

రెడ్డిగూడెం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను మంగళవారం పోలీసులు ముచ్చినపల్లి సమీపంలో అదుపులోకి తీసుకొని రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు అతనితో పాటు మొండితోక అరుణ్‌కుమార్, నల్లగట్ల స్వామిదాసులను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై బి.మోహన్‌రావు తెలిపారు.

సమస్యలపై అధ్యయనానికే క్షేత్రస్థాయి పరిశీలన



మాడపాటి అతిథి గృహాన్ని, సీవీ చారిటీస్ విశ్రాంతి భవనాన్ని, వేదపాఠశాలను సందర్శిస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి, మే 20 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలోని వనరులు, సదుపాయాలపై అధ్యయనం చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో పరిశీలించటం వల్ల సమస్యలు ఆకళింపు చేసుకోవటానికి వీలవుతుందని దుర్గగుడి ఈవో శీనా నాయక్ తెలిపారు. ఇటీవల ఈవో బాధ్యతలు స్వీకరించిన వి.కె. శీనానాయక్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. దుర్గగుడి పరిసరాలలోని అతిథి గృహాలను, వసతి సముదాయాలను పరిశీలించారు. మాడపాటి అతిథి గృహాన్ని తనిఖీ చేసిన ఆయన భక్తులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. అతిథి గృహానికి అవసరమైన మరమ్మతులను చేయించాలని, విద్యుత్ సరఫరా సమస్యను నివారించాలని ఈ.ఈ కోటేశ్వరరావుకు సూచించారు. సి.వి.రెడ్డి చారిటీస్ భక్తుల విశ్రాంతి సముదాయాన్ని కూడా పరిశీలించారు. భక్తులకు ఏవిధంగా సేవలు అందిస్తున్నారో ఆరా తీశారు. గుణదలలోని దేవస్థానం ఉద్యోగుల నివాస సముదాయాన్ని కూడా ఆయన పరిశీలించారు. క్వార్టర్లలో ఎంత మంది నివాసం ఉంటున్నారు, వారికి అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. అత్యంత ఖరీదైన దేవాలయ భూమి పరిరక్షణకు ఏవిధమైన చర్యలు తీసుకువాలో సిబ్బందికి సూచనలు చేశారు. పోరంకిలోని స్మార్త వేద పాఠశాలను కూడా ఆయన పరిశీలించారు. వేద విద్యార్థులకు అందే సదుపాయాలు, అధ్యాపకుల సమస్యలు తదితర అంశాలను తెలుసుకున్నారు.

హైడ్రామా!

(5వ పేజీ తరువాయి)

అధికారిణి నీలం సాహ్నీ ఆదేశాలను పోలీసులు అమలుచేయలేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఓవైపు హైకోర్టులో పిటిషన్ వేస్తూనే, మరోవైపు నగరంలోని శిబిరంలో కౌన్సిలర్లను బయటకు రానీయకుండా చూశారు.

తిరువూరులో ఉద్రిక్తత

ఓవైపు విజయవాడలో కౌన్సిలర్లను దాచి ఉంచిన దేవినేని అవినాశ్.. నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, మరికొందరు అనుచరులతో కలిసి మంగళవారం తిరువూరు బయల్దేరారు. టీడీపీ కార్యాలయంపై దాడి చేయించారన్న కసి ఒకవైపు, ఎన్నిక సందర్భంగా అల్లర్లు సృష్టించటానికి వస్తున్నాడన్న కసి మరోవైపు.. కలగలసి టీడీపీ శ్రేణులు అవినాశ్ తిరువూరు రాకుండా అడ్డుకున్నాయి. బాడవ టోల్‌ప్లాజా వద్ద ఆ పార్టీ నాయకులు కాపు కాశారు. ఈ విషయాన్ని పసిగట్టిన అవినాశ్.. రెడ్డిగూడెం మీదుగా తిరువూరు వెళ్లే ప్రయత్నం చేసినా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. ఈ తతంగంతో ఎన్నిక సమయం ముగిసిపోయింది. ఎన్నిక సమయం ముగిసే వరకు విజయవాడలో దాచి ఉంచిన వైసీపీ కౌన్సిలర్లు.. తిరువూరులోని కౌన్సిల్‌కు రాలేదు. హైకోర్టు నుంచి వచ్చిన ఆదేశాలతో వైసీపీ సభ్యులకు రక్షణ కల్పించాలని పోలీసులు విచారణ చేయగా, విజయవాడలో ఉన్నారని తెలిసింది. ఎన్నిక ముగిసే సమయానికి ఫలానా హోటల్‌లో ఉన్నారంటూ అవినాశ్ వర్గీయులు సమాచారాన్ని లీక్ చేశారు. దీంతో పోలీసులు ఆ హోటల్‌కు వచ్చి వైసీపీ కౌన్సిలర్లను తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అప్పటికే ఎన్నికకు గడువు ముగియటం, ఎన్నిక రద్దు కావటంతో ఎస్కార్టుతో ఒక బస్సులో వారిని తిరువూరు తీసుకెళ్లారు.

తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రద్దు

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నట్లు ప్రకటించి, తదుపరి చర్యల కోసం ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపుతామని తెలిపారు.

కార్యాలయం వద్దే టీడీపీ కౌన్సిలర్లు

టీడీపీ మద్దతు తెలిపిన వైసీపీకి చెందిన ఐదుగురు సభ్యులతో పాటు టీడీపీ చెందిన ముగ్గురు కౌన్సిలర్లు మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. తమకు మద్దతు ప్రకటించిన మరో ఇద్దరు కౌన్సిలర్లను వైసీపీ నాయకులు నిర్బంధించారని టీడీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. కార్యాలయం వద్ద ఉన్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో పాటు 8 మంది టీడీపీ కౌన్సిలర్లు సమావేశ మందిరంలోకి వెళ్లారు. అయితే, కోరం పూర్తికాదని, మరో ఇద్దరు కౌన్సిలర్ల కోసం వేచి చేశారు. ఎన్నిక రద్దయినట్లు అధికారులు ప్రకటించడంతో వారు కూడా వెళ్లిపోయారు. 13వ వార్డు కౌన్సిలర్ ఇనపనూరి చిన్నారిని వైసీపీ నాయకులు నిర్బంధించారంటూ ఆమె కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు వైసీపీ నాయకుడు నల్లగట్ల స్వామిదాసు ఇంటి వద్ద ఆందోళనకు దిగారు.

నిర్మానుష్యంగా కార్యాలయం రోడ్డు

తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో సోమవారం ఇరువర్గాలతో కిటకిటలాడిన మున్సిపల్ కార్యాలయం రోడ్డు మంగళవారం మాత్రం బోసిపోయింది. పోలీసు బందోబస్తు నేపథ్యంలో నిర్మానుష్యంగా కనిపించింది. దాదాపు పట్టణం మొత్తం పోలీసుల నిఘాతో నిండిపోయింది. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పట్టణ శివార్లకే పరిమితమయ్యారు.

భారీ బందోబస్తు

తిరువూరులో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ఏడీసీపీ, నలుగురు ఏసీపీలు, ఇద్దరు డీసీపీలు, మైలవరం ఏసీపీ, సీఐలు 8 మంది, పలువురు ఎస్సైలు తమ సిబ్బందితో సోమ, మంగళవారాల్లో గస్తీ నిర్వహించారు.

అమృత ధారలు

(5వ పేజీ తరువాయి)

తయారు చేసేందుకు ఢిల్లీ నుంచి సాంకేతిక బృందం మచిలీపట్నం వస్తుందని కేంద్రప్రభుత్వ అధికారులు సమాచారం పంపినా ఇక్కడి అధికారులు సరైన విధంగా స్పందించలేదు. దీంతో ఢిల్లీ సాంకేతిక బృందం పనుల అంచనాలు వేసేందుకు మచిలీపట్నం రాలేదు. దీంతో అనేక అభివృద్ధి పనులు అంచనాలకు నోచుకోకుండానే మరుగున పడిపోయాయి. ఈ అంశంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి గతంలో పలుమార్లు మునిసిపల్ అధికారులను నిలదీశారు. అప్పట్లో మంత్రిగా, ఎమ్మెల్యేగా కొనసాగిన పేర్నికి, ఎంపీ వల్లభనేనికి రాజకీయపరమైన విభేదాలు రావడం కూడా అభివృద్ధి పనులకు ఆటంకంగా మారిందని సమాచారం.

తవ్వేశారు.. వదిలేశారు!

(5వ పేజీ తరువాయి)

వర్షాలు కురుస్తున్నాయి. నెల రోజుల్లో కాలువలకు నీరు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పాత డీపీ కోసం తవ్విన కట్టకోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. వర్క్ ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై కంకిపాడు ఇరిగేషన్ ఏఈఈ నాగ బాబుని వివరణ కోరగా సమస్య చాలా కాలంగా ఉండటంతో టెంపరరీ వర్క్ చేద్దామని పాత డీపీని ఓపెన్ చేయాల్సి వ చ్చిందన్నారు. నీటి సంఘం అధ్యక్షుడు సూచనతోనే ఓపెన్ చేశామని తెలిపారు. పనులు చేయడానికి నిధులు లేవన్నారు.

సస్పెన్షన్ వేటు

(5వ పేజీ తరువాయి)

నిజాలు నిగ్గుతేలాయి. గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావుతో పాటు మాజీ కార్యదర్శి ఏ.వి.సుబ్బారావు కూడా దీనికి బాధ్యులని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఏపీ పంచాయతీ రాజ్ చట్టం-1994 సెక్షన్ 249(6) మేరకు సర్పంచ్‌ని మూడు నెలల పాటు సస్పెండ్ చేశారు. ఈ మూడు నెలల కాలానికి ఉప సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న 13వ వార్డు సెంబర్ శీలం సుమతిని సర్పంచ్ విధుల నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. సర్పంచ్ లింగాల భాస్కరరావు చెక్‌పవర్‌ను కూడా రద్దు చేసి ఉపసర్పంచ్‌కు ఆ అధికారాన్ని కల్పించారు.

అధికారం పోయినా వైసీపీ దౌర్జన్యాలు ఆగడం లేదు

● తిరువూరు ఘటనలపై ఎంపీ కేశినేని శివనాథ్

జగ్గయ్యపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : అధికారం పోయినా వైసీపీ నేతల దౌర్జన్యాలు, దాడులు ఆగటం లేదని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మండిపడ్డారు. జగ్గయ్యపేట నియోజకవర్గ మినీ మహానాడు ప్రాంగణంలో ఆయన మంగళవారం తిరువూరు ఘటనలపై స్పందించారు. తిరువూరు మునిసిపల్ కౌన్సిలర్లను ఎవరూ, ఎక్కడా అడ్డుకోలేదన్నారు. విజయవాడ నుంచి కొంత మంది నేతల ముసుగులో వచ్చిన గుండాలను విస్సన్నపేట వద్ద తమ పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారని చెప్పారు. ఎన్నిక నిస్పక్షపాతంగా జరగాలన్నదే తమ అభిమతమని, మెజార్టీ ఉన్న వ్యక్తే చైర్మన్ అవుతారని వ్యాఖ్యానించారు. ఆయన వెంట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి



గన్నవరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల మూత్రపిండాల నిపుణుడు డాక్టర్ బి.వరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కేసరపల్లి డాక్టర్ ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల్లో ఎన్‌సీసీ కేడెట్లకు, విద్యార్థులకు, సిబ్బందికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఒత్తిడి తగ్గించుకుంటే వ్యాధులు రావన్నారు. స్ఫిగ్మోమానో మీటర్‌ను అందజేశారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కిషోర్, డాక్టర్లు టి.కృష్ణ చైతన్యకుమార్, బోయపాటి అక్షర, జి.ఆనంద్, ఎన్.హర్ష, లెఫ్టినెంట్ కల్నల్ తీర్థప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి మల్లెలతో పూజ నిర్వహిస్తున్న ఈవో తారకేశ్వరరావు, శ్రీనివాసరావు

అభయాంజనేయ స్వామికి మల్లెలతో పూజ

హనుమాన్‌జంక్షన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి దేవస్థానం ఈవో పి.తారకేశ్వరరావు, గ్రామ టీడీపీ నాయకులు మట్టా శ్రీనివాసరావు సంయుక్తంగా 1008 మల్లెలతో ప్రత్యేక పూజ నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని జంక్షన్‌కు చెంది న దాత చింతా జగ్గయ్య కుటుంబ సభ్యులు భక్తులకు అన్నసంతర్పణ చేశారు. వేమూరి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఆటో ఢీకొన్న సైక్లిస్టు మృతి

పెనమలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీ కొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటనపై పెనమలూరు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం కానూరు కామయ్యతోపు సెంటరులో బందరు రోడ్డుపై గోసాలకు చెందిన సలార్(52) సైకిల్‌పై వెళుతున్నాడు. కంకిపాడు వైపు నుంచి విజయవాడ వైపు వేగంగా వెళుతున్న ఆటో అతడిని బలంగా ఢీ కొట్టడంతో కిందపడ్డాడు. తల, చేతులు, కాళ్లకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే సలార్ మృతి చెందాడు. పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

పైఅంతస్తు నుంచి పడి..

ఫిట్స్‌తో బాధపడుతూ తాము నివసిస్తున్న రెండవ అంతస్థు నుంచి కింద పడ్డ వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు విజయ దుర్గనగర్‌కు చెందిన చింతా దుర్గారావు (40) కొన్నాళ్లుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. సోమవారం దుర్గారావుకు మళ్లీ ఫిట్స్ రాగా భవనంలోని రెండవ అంతస్తు నుంచి కిందకు పడిపోయాడు. అతడిని చూసిన స్థానికులు తండ్రికి సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

పెదఅవుటపల్లి గ్రూపు దేవస్థానాల భూముల కౌలు వేలం 28న

ఉంగుటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ ధర్మాదాయశాఖ పరిధిలోని పెదఅవుటపల్లి గ్రూపు దేవస్థానాల్లో పెదఅవుటపల్లి, కేసరపల్లి దేవాలయాలకు చెందిన భూములను 2025-26 నుంచి 2027-28 వరకు (మూడేళ్లపాటు) కౌలుకు లీజుకిచ్చేందుకు ఈ నెల 28వతేదీ వేలం నిర్వహిస్తామని ఈవో కేఎల్ఎన్ శెట్టి తెలిపారు. పెదఅవుటపల్లి శ్రీసీతారామస్వామి దేవస్థానంకు చెందిన 16.99ఎకరాలు, స్పెసిఫిక్ ఎండోమెంట్స్ కింద దాత ఇచ్చిన మరో 14.52ఎకరాలు, శ్రీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంకు చెందిన 23.96ఎకరాలు, కేసరపల్లిలో శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన భూములకు ఎండోమెంట్స్ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వివరాలకు 7306733335 నెంబర్లో సంప్రదించాలని ఈవో శెట్టి సూచించారు.

వాటర్ బాటిల్స్ పంపిణీ

హనుమాన్‌జంక్షన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ సంస్థ 12వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆ సంస్థ నిర్వాహకులు మంగళవారం ప్రజలకు వేసవిని పురస్క రించుకొని ఖాళీ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద పాదచారులు, ముఠా కార్మికులు, ఆటోడ్రైవర్లు, ప్రయాణికులకు వందలాది బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు గరికపాటి నాగేశ్వరరావు, నూకల బాలాజీ, తవ్వా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ నాయకుడు సత్యకిషోర్‌కు సత్కారం

ఉయ్యూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా, వాకర్స్ అసోసియేషన్ జిల్లా చైర్‌పర్సన్‌గా సగ్గున రామ సత్యకిషోర్ చేసిన సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. డాక్టర్ జ్యోతి చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, రాంబాబు, తిరుమలరావు, చంటిబాబు, పొగిరి రాము, శ్రీనివాస్, మహీధర్, పూరకిషోర్, చిరంజీవి సత్కరించారు.



సత్యకిషోర్‌ను సత్కరిస్తున్న ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

మంత్రి కొల్లు రవీంద్ర



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

గన్నవరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమం, అభివృద్ధి విలువలతో కూడిన రాజకీయాలు చంద్రబాబుకే సాధ్యమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ గన్నవరం నియోజకవర్గ మినీ మహానాడు స్థానిక ఏబీ కన్వెన్షన్‌లో మంగళవారం రాత్రి నియోజకవర్గ పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా ఐటీ సంస్థలలో తెలుగు వారు ఉన్నారని, ఒక ప్రాంతీయ పార్టీకి కేంద్రంలో ప్రముఖ భూమిక పోషించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేది టీడీపీయేనని, ఆనాడు ఓబులాపురం గనుల్లో ఎక్కడా లేని అవినీతి జరిగిందన్నారు. దానిపై ఎంతో పోరాటం చేసి జైలుకు వెళ్లిన పరిస్థితి ఉందన్నారు. 12ఏళ్ల తరువాత అదే కేసులో శిక్ష పడిందంటే అది తెలుగుదేశం పార్టీ విలువల కోసం పని చేసిందని చెప్పారు. జగన్‌రెడ్డి నాయకత్వంలో అనేక భారీ కుంభకోణాలు రాష్ట్రంలో జరిగాయన్నారు. అవన్నీ బయటకి వస్తున్నాయన్నాయన్నారు. ఆగిపోయిన పోలవరాన్ని ప్రధాని మంత్రి మోదీతో ప్రారంభించబోతున్నామని తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఎన్టీఆర్ స్ఫూర్తితో ముందుకు సాగుతూ సమాజంలో సమానత్వం కోసం పని చేసానన్నారు. నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా టీడీపీని పటిష్ఠం చేస్తానని ఎన్నికల్లో చెప్పిన హామీలను అమలు చేసేలా విశేష కృషి చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గాన్ని విధ్వంసం వైపు నడిపించారని ప్రస్తుతం వాటి నుంచి కోలుకుని పూర్వ వైభవం దిశగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న ట్లు తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా క్యాంపు కార్యాలయాన్ని సంప్రదిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, భవిష్యత్ ఎన్నికలకు నాందిగా మహానాడు నిలుస్తుందన్నారు. బూత్ స్థాయి నుంచే పార్టీ ప్రతిష్ఠ చేయాలన్నారు. రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, గూడవల్లి నరసయ్య, మూల్పూరు సాయికల్యాణి, బొప్పన హరికృష్ణ, కొండేటి వెంకటేశ్వరరావు, కోనేరు నాగేంద్రకుమార్, గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల గోపాలకృష్ణ, దయాల రాజేశ్వరరావు, గొడ్డళ్ల చిన రామారావు, కొలుసు రవీంద్రబాబు, బోడపాటి రవికుమార్, మేడేపల్లి రమా, పరుచూరి నరేష్, కొసరాజు సాయిరాం, కోనేరు సందీప్, కొల్లా ఆనంద్ పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పెనమలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కంకిపాడు మండలానికి చెందిన వ్యక్తులకు 1.85 లక్షలు, పెనమలూరు మండలానికి 1.98 లక్షలు, తాడిగడప మునిసిపాలిటీకి 2.43 లక్షలు, ఉయ్యూరు మండలానికి చెందిన వ్యక్తులకు 56వేల విలువైన చెక్కులను ఆయన అందజేశారు.

ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు ఆహ్వానం

కంకిపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను ఆహ్వానిస్తూ ఆయనకు మార్కెట్ యార్డు చైర్మన్ అన్నే ధనయ్య ఆహ్వానపత్రికను మంగళవారం అందించారు. ఆహ్వానించిన వారిలో అన్నే ధనయ్యతో పాటు వైస్ చైర్మన్ ఎం కళ్యాణి, డైరెక్టర్లు ఉన్నారు.

వైవీబీ రాజేంద్రప్రసాద్‌కు ఆహ్వానం

ఉయ్యూరు : కంకిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి విశిష్ట అతిథిగా హాజరుకావలసిందిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను అన్నే ధన కోటేశ్వరరావు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 23న కంకిపాడు మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న అన్నే ధనకోటేశ్వరరావు మంగళవారం రాజేంద్రప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు. సగర సాధికార కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, జిల్లా టీఎన్ టీయూసీ అధ్యక్షుడు కొండవీటి శివ య్య, గ్రామపార్టీ అధ్యక్షుడు బుజ్జులు తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రప్రసాద్‌ను ప్రమాణస్వీకార మహోత్సవానికి ఆహ్వానిస్తున్న అన్నే

మినీ మహానాడులో తీర్మానాలు

గన్నవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): గన్నవరంలో జరిగిన మినీ మహానాడులో పలు తీర్మానాలను సభ అధ్యక్షుడు వద్రాణం హరిబాబు నాయుడు ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. ● జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆ ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం, వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి సానుభూతిని తెలుపుతూ తీర్మానం పెట్టారు. ● నియోజకవర్గంలో టీడీపీ అభివృద్ధికి విశేష సేవలందించిన మాజీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, మండవ రమ్యకృష్ణ, కూచిపూడి సుబ్బయ్య, తాళం సురేష్, మరీదు గోవిందులు, సుధీర్, అద్దేపల్లి సంజీవ రాజులకు నివాళులర్పించారు. ● సీఎంఆర్ఎఫ్ నుంచి ఇప్పటి వరకు రూ.2.67 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. ● మల్లవల్లి పారిశ్రామిక కారిడార్‌కు ఎక్కువ పరిశ్రమలు తరలివచ్చి అభివృద్ధి చేసేందుకు వీలుగా భూముల ధరలను గణనీయంగా తగ్గించి గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన విధానంలోనే పారిశ్రామిక వేత్తలకు భూములు కేటాయింపు ● పోలవరం కుడికాలువ 137వ కిలో మీటర్ బండారుగూడెం నుంచి ఏలూరు కాలువ 36వ కిలోమీటరుకు గోదావరి జలాలను అనుసంధానం చేయటం ● గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎదురుగా ఉన్న సుమారు 12.50 ఎకరాల్లో అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయించాలని తీర్మానం చేశారు.



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

అభయాంజనేయుడి సేవలో ఎమ్మెల్యే చింతమనేని

హనుమాన్‌జంక్షన్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామిని మంగళవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఉత్సవాలను ఆయన చేతులు మీదుగా ప్రారంభించాలని నిర్వాహకులు భావించారు. అందుబాటులో లేక పోవడంతో ఆయన సతీమణి రాధమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన విషయం తెలిసిందే. దేవస్థానం ఈవో పి.తారకేశ్వరరావు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు చింతమనేని గోత్ర నామాలతో అర్చన జరిపి స్వామి వారి ఆశీర్వచనాలు అందజేసి దేవస్థానం తరుపున శాలువతో సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు. ఆయన వెంట కూటమి నాయకులు వేమూరి శ్రీనివాసరావు, చలమలశెట్టి రమేశ్‌బాబు, మట్టా శ్రీనివాసరావు, గరికపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వ్యతిరేకంగా చట్టాలు

కౌలు రైతు సంఘం కార్యదర్శి హరిబాబు



కంకిపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు.. పెనమలూరులో..

కంకిపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులకు, పేదలకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా ఉంటున్నాయని రాష్ట్ర కౌలు రైతు సంఘం కార్యదర్శి ఎం.హరిబాబు ధ్వజమెత్తారు. మంగళవారం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కంకిపాడులో పెద్ద ఎత్తున జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హరిబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దారుకు అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుమారి, నరేష్, శివశంకర్, జన్మేజస్, మరియదాస్ పాల్గొన్నారు.

పెనమలూరు : పెనమలూరు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలంటూ నిరసన ర్యాలీ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. త్రిమూర్తులు ర్యాలీలో మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు కార్మికులకు రూ. 26వేలు వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ ప్రసన్న, బాణావతి రాణి, సుజాత, అక్కి దాసరి డేవిడ్, వెంకటరెడ్డి, పి సత్యనారాయణ, దుర్గ, కంచర్ల పద్మ, శివమణి, లక్ష్మి, జ్యోతి, శ్రీలక్ష్మి, నాగమల్లేశ్వరి, మధిర రమణ, దుర్గారావు, గని తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలు గు లేబర్‌కోడ్లు వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కంచర్లపల్లి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. ఉయ్యూరు సెంటర్‌లో మంగళవారం కార్మికులు నిరసన, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బి.రాజేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఆకవరపు తిరుపతయ్య, ఐద్వా జిల్లా సహాయ కార్యద ర్శి బి.కీర్తి, సీపీఎం నాయకుడు గోపాల్, బైక్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇబ్రహీం, మురళి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సాయిశ్రీను, కృష్ణకుమారి, సరోజిని పాల్గొన్నారు.

గన్నవరం : కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కళ్లం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ కేవీ శివయ్యకు వినతిపత్రాన్ని అందజే శారు. నాయకులు బెజవాడ తాతబ్బాయి, మిరప నాగేశ్వరరావు, మోటమర్రి నాగబ్రహ్మచారి మల్లంపల్లి ఆంజనేయులు, గణేష్, శివాచారి, సాంబ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం సీఐటీయూ బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక నూజవీడు రోడ్డులో సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభించి నాలుగు రోడ్లలో ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో ర్యాలీని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకుడు కళ్లం వెంకటేశ్వరరావు ప్రసంగించారు. సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు బేత శ్రీనివాసరావు, నల్లి ఆంజనేయులు, రైతు సంఘం మండల అధ్యక్షుడు తోట సాంబశివరావు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ఉంగుటూరు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి, వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కార్మికుల హక్కులను కాలరాసే లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కడవకొల్లు రామరాజు, పిల్లి రాజారావు, ఎస్‌కేఎం సలీం, మాగంటి సాంబశివరావు, భీమవరపు సుబ్బారెడ్డి, షేక్ మహబూబీ, కోటేశ్వరమ్మ, గుండె కోటేశ్వరమ్మ, అరుణ, కళ్యాణి, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంపై అవగాహన పెంచుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : తెలుగు సాహిత్యంపై అవగాహనతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నృత్యాభినయం లాంటివి ఉపయోగపడుతాయని గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి తెలిపారు. వీరవల్లి గ్రంథాలయ ఆవరణలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులతో ఏకపాత్రాభినయం, నృత్యాభినయం చేయించారు.

నిర్వహణ కారణాలతో పలు రైళ్ల రద్దు

రైల్వే స్టేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ కారణాల దృష్ట్యా ఈనెల 21 నుంచి 25 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22849 షాలిమార్ - సికింద్రాబాద్ రైలును ఈనెల 21న, 02863 సత్రాగచ్చి - యశ్వంతాపూర్ రైలును ఈనెల 22న రద్దు చేశారు. 22817 హౌరా - మైసూర్, 22850 సికింద్రాబాద్ - షాలిమార్ రైళ్లను ఈనెల 23న, 02864 యశ్వంతాపూర్ - సత్రాగచ్చి రైలును ఈనెల 24న, 22818 మైసూర్ - హౌరా రైలును ఈనెల 25న రద్దు చేశారు.

11న ఇండియన్ రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్ వార్షిక సర్వసభ్య సమావేశం జూన్ 11న ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు, కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ నియామకాలు 2017ను అనుసరించి జిల్లా బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సభ్యులను అనగా ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, కోశాధికారి, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకుంటారన్నారు. రెడ్‌క్రాస్ సభ్యులు (పోషకులు/వైస్ పోషకులు/లైఫ్ సభ్యులు/లైఫ్ అసోసియేట్లు) తప్పనిసరిగా హాజరుకావాలని కోరుతున్నట్టు లక్ష్మీశ తెలిపారు.

బుడమేరు, వాగుల గండ్లు పూడ్చివేతకు నిధులు

● మరమ్మతులకు రూ.48.15కోట్లు మంజూరు
● కేబినెట్ ఆమోదం తెలిపిందన్న ఎమ్మెల్యే వసంత

మైలవరం రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): బుడమేరు, వాగుల గండ్లు, పూడ్చివేత, మరమ్మతుల పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.48.15కోట్ల మంజూరుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపిందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వెల్లడించారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన మినీ మహానాడులో ఆయన ఈ వివరాలు తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందినట్టు చెప్పారు. అతి త్వరలోనే పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పూర్తి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మినీ మహానాడు రోజున ఈ రెండు శుభవార్తలు వినటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 22న ఎన్టీఆర్ జిల్లా స్థాయి మహానాడు గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తారన్నారు.

రెండు రోజుల కస్టడీకి ఓలుపల్లి రంగా

విజయవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన భూకబ్జా కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహనరంగరావు అలియాస్ రంగాను రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇస్తూ న్యాయస్థానం ఉత్తర్వులిచ్చింది. తేలప్రోలుకు చెందిన శనగల శ్రీధర్‌రెడ్డికి చెందిన భూమిని రంగా బెదిరించి బలవంతంగా మరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేయించాడని పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారించేందుకు రంగాను వారంపాటు కస్టడీకి ఇవ్వాలని ఆత్కూరు పోలీసులు గన్నవరంలోని 8వ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు కొద్దిరోజుల క్రితం ముగిశాయి. ప్రస్తుతం గన్నవరం కోర్టుకు వేసవి సెలవులు కావడంతో ఇన్‌చార్జి కోర్టుగా ఉన్న విజయవాడ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బుధ, గురువారాలు రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి అనుమతిచ్చింది.

ఇంటర్నేషనల్ ఫ్లైట్స్‌తోనే ఎయిర్ కార్గోకు మార్గం!



● డిమాండ్ తేలకుండా కార్గో ఫ్లైట్స్ రావాలంటే కష్టం ● పాసింజర్ విమానాలు నడిపి పరిశీలించాలి ● తర్వాతే డిమాండ్‌పై అవగాహన

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని వ్యాపార వర్గాలు విదేశాలకు ఎగుమతులను మరింతగా విస్తరించేందుకు కార్గో విమాన సదుపాయం కల్పించాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. అయితే డైరెక్ట్‌గా ఇంటర్నేషనల్ కార్గో విమానాలు నడిపేందుకు ప్రస్తుతం తగిన వనరులు లేవు. కార్గో విమాన సర్వీసులు నడవాలంటే ప్రత్యేక కార్గో విమానాలుండాలి. లేదంటే విదేశాలకు నేరుగా కనెక్టవిటీ కలిగిన అంతర్జాతీయ ప్రయాణికుల విమానాలైనా ఉండాలి. విజయవాడ కేంద్రంగా తయారీ రంగాలు ఎక్కువ. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఎక్కువ. పండ్లు, కూరగాయలు, ఆక్వా ఉత్పత్తులు వంటివి పెద్ద ఎత్తున ఎగుమతికి అవకాశం ఉంది.



డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులకే ప్రాధాన్యం

ప్రపంచంతో బలమైన కనెక్టివిటీ కలిగిన సింగపూర్, దుబాయ్, అబుదాబి, ఖతార్ వంటి డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులకు విజయవాడ నుంచి నేరుగా విమాన సర్వీసులు ఉంటేనే, కార్గో ఎగుమతులకు మార్గం సుగమవుతుంది. ప్రస్తుతం విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి షార్జాకు 2 విమానాలు నడుస్తున్నా, షార్జా డెస్టినేషన్ ఎయిర్‌పోర్టు కాకపోవడంతో ప్రయోజనం తక్కువ.

సింగపూర్ సర్వీసు విజయవంతం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీజీఎఫ్ (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్) పద్ధతిలో ఇండిగో ద్వారా ప్రారంభించిన విజయవాడ-సింగపూర్ సర్వీసు భారీ స్పందన పొందింది. ఇది 95 శాతం ఆక్యుపెన్సీతో నడిచింది. కొంతకాలానికే వీజీఎఫ్‌ను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో ఆ సర్వీసు నిలిపేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పండ్లు, కూరగాయలు, ఆక్వా ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు విస్తృతంగా ఉన్నాయి. ఇవన్నీ విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఏకైక మార్గం విజయవాడ నుంచి డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులకు నేరుగా విమానాలు నడపడమే.

హాప్ పద్ధతిలో అవకాశాలు

హాప్ పద్ధతి అంటే విజయవాడ నుంచి బయలుదేరే విమానాలు దేశంలోని మరో ఎయిర్‌పోర్టులో కూడా ఆగి అక్కడి నుంచి కూడా ప్రయాణికులను తీసుకువెళ్లేలా విమానాలు నడపవచ్చు. నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించడం సాధ్యపడకపోతే ఇలా చేయొచ్చు. అంటే విజయవాడ నుంచి విశాఖపట్నం లేదా హైదరాబాద్ మీదుగా హాప్ పద్ధతిలో దుబాయ్, ఖతార్, అబుదాబి వంటి ఎయిర్‌పోర్టులకు విమాన సర్వీసులు నడిపితే, ఆక్యుపెన్సీ పెరగడమే కాకుండా కార్గో లోడింగ్‌కు స్థలాన్ని కూడా కల్పించవచ్చు. ఒక అంతర్జాతీయ విమానంలో సగటున 50-60 మెట్రిక్ టన్నుల సరకులు లోడ్ చేయవచ్చు. ఇలా ఎన్ని విమానాలు నడుస్తాయో అంత సామర్థ్యం కార్గో ఎగుమతికి ఏర్పడుతుంది. దీనివల్ల నూరు శాతం ఆక్యుపెన్సీ లభించే అవకాశం ఉంది.

ఏపీ చాంబర్స్ నిరంతర కృషి

అంతర్జాతీయ సర్వీసుల కోసం ఏపీ చాంబర్స్ నిరంతర కృషి చేస్తోంది. గతంలో ముంబయికి విమాన సర్వీసుల ఏర్పాటుకు లేఖల ద్వారా విమానయాన సంస్థలను ఒప్పించి విజయవంతమైంది. ఇప్పుడు అంతర్జాతీయ సంస్థలను ఆశ్రయిస్తూ, విజయవాడ ఎయిర్‌పోర్టు సామర్థ్యాన్ని వివరించేలా లేఖలు రాస్తోంది. ఇటీవల ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు విజయవాడకు వచ్చి పరిశీలనలు జరిపిన అనంతరం పరిశీలిస్తామంటూ తెలిపింది.



ధర్నాలో పాల్గొన్న వివిధ కార్మిక, రైతు సంఘాల నేతలు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● జూలై 9న సమ్మెను జయప్రదం చేయండి: వక్తలు

ధర్నాచౌక్, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులకు శాపంగా మారాయనీ తక్షణమే వీటిని రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గతంలో లాక్‌డౌన్ సమయంలో దొడ్డి దారిన కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లకు రూపకల్పన చేసి ప్రవేశపెట్టిందని ధ్వజమెత్తారు. యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు ఈ కోడ్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్మిక చట్టాలను తిరిగి పునరుద్ధరించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 9న సమ్మెకు సన్నద్ధం కావాలని, ఇప్పటి నుంచే సమ్మె నోటీసులు అందజేయాలని కార్మికులను పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే దుర్గారావు, ఏఐటీయూసీ నగరాధ్యక్షుడు మూలీ సాంబశివరావు అధ్యక్షతన ఏపీ రైతు సంఘాల సమన్వయకర్త వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర నేతలు వీఎల్ నరసింహులు, ఏ వెంకటేశ్వరరావు, ఏ కమల, వెంకటసుబ్బయ్య, కేఆర్ ఆంజనేయులు, ఏఐటీయూసీ, ఏఐసీసీటీయూ, ఇఫ్టూ, టీయూసీఐ నేతలు సుధీర్, ఉదయ్‌కుమార్, ఎం.రామకృష్ణ, శంకర్, మరీదు ప్రసాద్, రైతు సంఘాల నేతలు రావుల వెంకయ్య, వై.కేశవరావు, డీ హరినాథ్, ఈశ్వరయ్య, జమలయ్య, ఆశా, అంగ్‌వాడీ యూనియన్ నేతలు శ్రీలక్ష్మీ, టి.గజలక్ష్మి పాల్గొన్నారు.

ఐసెట్‌లో మెరిసిన ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులు

● మూడో ర్యాంక్ సాధించిన సాకల కృష్ణసాయి
● విజయవాడ నుంచి 1,980 మందికి అర్హత

విజయవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎంసీఏ, ఎంబీఏ కోర్సులకు నిర్వహించిన ఏపీ ఐసెట్-2025 పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన సాకల కృష్ణసాయి రాష్ట్రంలో మూడో ర్యాంక్ సాధించాడు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 2528 మంది విదార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో పురుషులు 1,147 మంది, మహిళలు 1,381 మంది ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో పురుషులు 1,012 మంది, మహిళలు 1255 మంది (మొత్తం 2,267 మంది) పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 2,191 మంది ఐసెట్‌కు అర్హత సాధించారు. 975 మంది పురుషులు కాగా, మహిళలు 1,216 మంది అర్హత సాధించారు. ఉమ్మడి జిల్లాలో మైలవరం నుంచి 153 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 144 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 139 మాత్రమే అర్హత సాధించారు. తిరువూరు నుంచి 85 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 76 మంది పరీక్షకు హాజరైతే 72 మంది ఐసెట్‌కు అర్హత సాధించారు. విజయవాడ నుంచి మొత్తం 2,290 మంది దరఖాస్తు చేసుకుంటే 2,051 మంది పరీక్షకు హాజరయ్యారు. హాజరైన వారిలో 1,980 మంది ఐసెట్‌కు అర్హత సాధించారు.

కృష్ణా జిల్లా నుంచి మొత్తం 713 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 338 మంది పురుషులు, 375 మంది మహిళలున్నారు. 311 మంది పురుషులు, 357 మంది మహిళలు మొత్తంగా 668 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 638 మంది ఐసెట్‌కు అర్హత సాధించారు. 299 మంది పురుషులు, 339 మంది మహిళలున్నారు.

ఆటోనగర్‌లో ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్

● పాత కన్సల్‌టెంట్ సంస్థకే డీపీఆర్ బాధ్యతలు
● ఎకరం 87 సెంట్లలో ఏర్పాటు
● బస్‌స్టేషన్‌తో పాటు వ్యాపార కేంద్రంగా మార్చేలా నిర్మాణం
● నెల రోజుల్లో నివేదిక ఇవ్వనున్న సంస్థ

పీపీపీ విధానంలో బహుళప్రయోజనకరంగా ఏర్పాటు



ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ నమూనా

బస్‌స్టేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆర్టీసికి చెందిన ఖాళీస్థలాలను కమర్షియల్‌గా వినియోగించుకోవటానికి చర్యలు చేపట్టారు. అందుకు తగిన ప్రతిపాదనలు ఇవ్వాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఆటోనగర్ డిపోను ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్‌గా నిర్మించటానికి జీప్లస్2 భవన నిర్మాణం చేపట్టటానికి ప్రయత్నం జరుగుతోంది. గతంలోనూ ప్రయత్నించినప్పటికీ అమల్లోకి రాలేదు. గతంలో రూపొందించిన డీపీఆర్‌ను అదే సంస్థ ఇచ్చి సవరణలు చేయించనున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో ఈ నిర్మాణం జరగనుంది. ఆటోనగర్‌లో ఉన్న బస్‌స్టేషన్‌ను నేలమట్టం చేసి అక్కడే ఈ బహుళ ప్రయోజన బస్ టెర్మినల్ నిర్మాణానికి ఆర్టీసీ నిర్ణయించింది. దాదాపు 2 ఎకరాల్లో నిర్మించనున్న ఈ బస్ టెర్మినల్‌కు ప్రైవేటు సంస్థలు పెట్టుబడి పెట్టి వాణిజ్య దుకాణాలు, సినిమా థియేటర్లు, మాల్స్, విశ్రాంతి గదులు, డార్మిటరీలు నిర్మించనున్నారు. వచ్చిన ఆదాయంలో ఆర్టీసీకి వాటా చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకోనున్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణ బాధ్యతలు అప్పగించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఇక్కడి నుంచి బందరు రోడ్డు వైపు మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ వైపు బస్సులు నడుస్తున్నాయి. ఇప్పుడీ భవనాన్ని నేలమట్టం చేస్తే ఇక్కడి నుంచి వెళ్లే బస్సులను సమీప బస్టాండ్‌కు సర్దుబాటు చేసే అవకాశం ఉంది. వాస్తవంగా బిల్ట్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో నిర్మించాలనుకున్నప్పటికీ ఆదాయార్జిత మార్గాల అన్వేషణలో భాగంగా పీపీపీ విధానంలోనే నిర్మించాలన్న యోచిస్తున్నట్టు తెలిసింది.

రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే అధికారులు

రైల్వే స్టేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉగ్రవాదుల కదలికలు, భద్రతా కారణాల దృష్ట్యా విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు డీఎస్పీ రత్నరాజు ఆధ్వర్యంలో గవర్నమెంట్ రైల్వే సీఐ జె.వి.రమణ, ఆర్‌పీఎఫ్ అధికారుల సమన్వయంతో విజయవాడ రైల్వే స్టేషన్‌లో మంగళవా రం విస్తృత తనిఖీలు ని ర్వహించారు. అనుమానితులు, సంఘవిద్రోహ శక్తులను గుర్తించడానికి ప్రత్యేకంగా రైల్వే పోలీసులు వివిధ పరికరాలను వినియోగించారు. జాగిలాలు, మెటల్ డిటెక్టర్లు, బాంబు డిస్పోజల్ మెటీరియల్ తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకట రమణ మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లోకి అసాంఘిక శక్తులు చొరబడకుండా భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతా ల్లో అనుమానిత వ్యక్తులు కనపడినా, ఎవరైనా వదిలేసిన బ్యాగ్‌లు ఉన్నట్టయితే 139కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

● అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచారాన్ని నిర్వహించనుందని, నెలరోజుల పాటు జరిగే ఈ ప్రచారాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. యోగాంధ్రపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది కూడా కొంత సమయం పాటు యోగా సాధన చేయాలని, పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం వంటి పోటీలు నిర్వహించాలని సూచించారు. బాపూ మ్యూజియం, కొండపల్లి ఖిల్లా, గాంధీ హిల్ వంటి చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర నిర్వహించనున్నట్టు వివరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్, వైద్య ఆరోగ్యం, ఇలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యోగాంధ్ర విజయవంతానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్సులో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, వివిధ శాఖల జిల్లాస్థాయి, మండలాధికారులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో పాల్గొన్న ఏపీసీఆర్‌డీఏ నైపుణ్య శిక్షణ అధికారి సాయి శ్రీనివాస్

జాబ్‌మేళాకు భారీగా రాజధాని యువత

కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సౌజన్యంతో మంగళవారం తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో జాబ్‌మేళా జరిగింది. ఈ మేళాలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిటైల్, ఆటోమొబైల్, హెల్త్‌కేర్, ఐటీ సేవలు, ఫైనాన్స్ రంగాలకు చెందిన 11 ప్రముఖ కంపెనీలైన ఎన్‌సీసీ, సీఐఐ-ఎంసీసీ, కాప్‌స్టన్ సర్వీసెస్, ముక్కు ఫైనాన్షియల్ కన్సల్టింగ్, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్, ఎస్‌బీఐ కార్డ్స్, వెకెన్ ఇండియా, హ్యాపీ మొబైల్స్, వరుణ్ మోటార్స్, ఎల్‌వీ ప్రసాద్ ఐ హస్పటల్స్, స్కిల్‌క్రాఫ్ట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. జాబ్‌మేళాకు 589 మంది అభ్యర్థులు హాజరుకాగా, పలువురు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. దీంతో మొత్తంగా 900 మందికి హాజరైన సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళాలో 100 మంది ఆఫర్ లెటర్లు అందుకోగా, 170 మంది అభ్యర్థులు తదుపరి రౌండ్లకు ఎంపికయ్యారు. ఏపీసీఆర్‌డీఏ నైపుణ్య శిక్షణ అధికారి సాయి శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి అరుణకుమారి సమన్వయ బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్ఏసీ అసిస్టెంట్ డైరక్టర్ వి.నర్సింహారావు, సీఆర్‌డీఏ డీసీడీవో బి.శ్రీనివాసరావు, సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్ పాల్గొని జాబ్‌మేళాను సమర్థవంతంగా నిర్వహించారు.

మైనారిటీ కార్పొరేషన్ 50 శాతం సబ్సిడీ

● ఆన్‌లైన్ ప్రక్రియకు రంగం సిద్ధం

రామలింగేశ్వర నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, యువతకు జీవనోపాధి, నిరుద్యోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా మైనారిటీ వర్గాలకు చెందిన యువతకు 50 శాతం సబ్సిడీతో అతి తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. మైనారిటీ వర్గాలకు చెందిన సుమారు 5 లక్షల మంది నిరుద్యోగులకు రాష్ట్రప్రభుత్వం రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల మించకూడదని, దరఖాస్తుదారుల వయస్సు 21 నుంచి 55ఏళ్ల మధ్య ఉండాలని ఈ ప్రకటన ద్వారా తెలిపారు. మైనారిటీ వర్గాలైన ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన మతాల వారికి మాత్రమే అర్హులుగా ప్రకటించారు. దీంతో పాటు కొన్ని ప్రత్యేక స్కీమ్స్‌కు డీఫార్మసీ, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్హతతో పాటుడ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు హెచ్‌టీటీపీఎస్://ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఒలింపిక్ పతకం సాధనే లక్ష్యం కావాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



ఆర్చరీ ఉపకరణాలను కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అందిస్తున్న అమరావతి బోటింగ్ క్లబ్ సభ్యులు

కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): విలువిద్యలో క్రీడాకారులకు మరింత నైపుణ్యాలను అందించి, వచ్చే ఒలింపిక్ క్రీడల్లో వోల్గా ఆర్చరీ అకాడమీ శిక్షణ పొందిన క్రీడాకారులు పతకాన్ని సాధించడమే లక్ష్యంగా శిక్షణ అందించి, నగరానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, పీ4 విధానం స్ఫూర్తితో క్రీడా పరికరాలను అందించేందుకు ముందుకొచ్చిన అమరావతి బోటింగ్ క్లబ్ ప్రతినిధులను అభినందిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వోల్గా ఆర్చరీ అకాడమీకి రూ.1.16 లక్షల విలువైన ఆర్చరీ ఉపకరణాలను అమరావతి బోటింగ్ క్లబ్ ప్రతినిధులు కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ-4 విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని వోల్గా ఆర్చరీ అకాడమీకి అమరావతి బోటింగ్ క్లబ్ మార్గదర్శిగా సహాయం అందించినట్టు తెలిపారు. ఆర్చరీ అకాడమీకి ఎలాంటి లాభాపేక్ష లేకుండా శిక్షణ అందిస్తూ మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తోందని కలెక్టర్ వివరించారు. అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, వోల్గా ఆర్చరీ అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ, ఆర్చరీ నేషనల్ కమిటీ సభ్యులు బీవీ రమణ, జిల్లా ట్రెజరర్ జి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి సహాయం సామాజిక బాధ్యత

దేశం కోసం అహర్నిశలు సేవలందిస్తూ విధి నిర్వహణలో ఆటుపోట్లను ఎదుర్కొంటున్న సైనికుల సంక్షేమంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని భావించి విరాళం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సైనిక సంక్షేమ నిధికి విరాళంగా కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ ప్రతినిధులు అందించిన రూ.లక్ష చెక్కును మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ ఆయన చాంబర్‌లో జిల్లా సైనిక సంక్షేమ అధికారి లెఫ్టినెంట్ కమాండర్ కె.కళ్యాణవీణకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ ప్రతినిధులు సామాజిక బాధ్యతగా రూ.లక్ష విరాళాన్ని సైనిక సంక్షేమ నిధికి విరాళంగా అందించడం వారి దాతృత్వానికి నిదర్శనమన్నారు. సైనిక సంక్షేమ నిధికి సహాయం అందించేందుకు మరింత మంది ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి సర్జస్ లెఫ్టినెంట్ కమాండర్ డాక్టర్ కళ్యాణవీణ, కోసల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ జనరల్ మేనేజర్ కేవీ మారుతీరావు, జిల్లా క్లస్టర్ హెడ్ టి.రామకృష్ణ పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ-పీఎన్‌డీటీ) చట్టాన్ని ఉల్లంఘిస్తే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని, సమన్వయ శాఖల అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు, డెకాయ్ ఆపరేషన్లను ముమ్మరం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం, ఏఆర్‌టీ-సరోగసీ చట్టాల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఏ సత్యానందం హాజరైన సమావేశంలో కమిటీ ఛైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేయాలని, ఫిర్యాదులు వస్తే త్వరగా విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రస్తుతమున్న స్కానింగ్ కేంద్రాలకు అదనంగా కొత్త రిజిస్ట్రేషన్లకు సంబంధించిన 9 దరఖాస్తులను, 3 రెన్యువల్ దరఖాస్తులను, 4 క్యాన్సిలేషన్ దరఖాస్తులను కమిటీ పరిశీలించి, చర్చించి, ఆమోదం తెలిపింది. అలాగే ఏఆర్‌టీ లెవల్-1 కేటగిరీకి సంబంధించిన 2 దరఖాస్తులు, ఏఆర్‌టీ లెవల్-2 కేటగిరికి సంబంధించిన 2 దరఖాస్తులతో పాటు సరోగసీ క్లినిక్‌కు సంబంధించి ఒక దరఖాస్తుకు కమిటీ ఆమోదం తెలిపింది. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు, రెన్యువల్‌కు, మార్పులు, చేర్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే కమిటీకి నివేదించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వాసవ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.రేష్మీ, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజ, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవో డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

హనుమజ్జయంతి మహోత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ ఈవో గోపాలరావు

గుడివాడ, మే 20 (ఆంధ్రజ్యోతి) : గౌరీశంకరస్వామి దేవస్థాన ఉపాలయం సువర్చల సమేత ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 21 నుండి 23వ తేదీ వరకు నిర్వహించు వార్షిక హనుమత్ జయంతి మహోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు ఆహ్వాన పత్రికను ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు అందజేశారు. ఆలయ అర్చకస్వాములు ఎమ్మెల్యే వెనిగండ్లను వేదమంత్రోచరణలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్ఆర్ కళాశాలకు నాక్ "ఏ" గ్రేడ్ గుర్తింపు

గుడివాడ, మే 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అక్కినేనినాగేశ్వరరావు కళాశాలకు సీజీపీఏ 3.06 స్కోరుతో నాక్ "ఎ" గ్రేడ్ గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్ తెలిపారు. స్థానిక కళాశాలలో మంగళవారం కళాశాలకు నాక్ గుర్తింపు సాధించడం పట్ల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల మూడోసారి నాక్ అసెస్మెంట్, అక్రిడిటేషన్‌లో పాలుపంచుకుందన్నారు. నాక్ గుర్తింపు ప్రక్రియలో కీలకపాత్ర పోషించిన ఐ.క్యూ.ఏ.సి సమన్వయకర్త డాక్టర్ ఎం.శివనాథ్, వివిధ అంశాల బాధ్యులను పాలకవర్గ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షకార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

గుడివాడ రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్ సిస్టమ్‌పై వీడియో కాన్ఫరెన్స్, అవగాహన సదస్సు నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు ఏదైనా సమస్యపై అర్జీ వస్తే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రతి సమస్య సాధ్యమైనంత వరకు కింది స్థాయిలోనే పరిష్కరించాలని తెలిపారు.

అకాల వర్షంతో తప్పని అవస్థలు

● లోతట్టు ప్రాంతాలు జలమయం ● డ్రెయినేజీ వ్యవస్థ లేక రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



గుడివాడలో నీటమునిగిన రైతుబజారు

గుడివాడ, మే 20(ఆంధ్రజ్యోతి) : మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి గుడివాడ తడిసి ముద్దైంది. పట్టణంలోని శివారు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. భారీ ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. దనియాలపేటలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. పలుచోట్ల డ్రెయినేజీలు పొంగి రహదారికి మీదకు మురుగునీరు చేరింది. రైతుబజారులో నీరు నిలిచిపోవడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. గుడివాడ బస్టాండ్ పరిస్థితి దారుణంగా తయారైంది.

కూచిపూడి :మంగళవారం వేకువజాము నుంచి కురిసిన కుంభవృష్టి వర్షంతో ప్రజలు అవస్థలు పడ్డారు. పల్లపు ప్రాంతాలు జలమయం కావటంతో జనజీవనం స్తంభించింది. కూచిపూడి బస్టాండ్ ప్రాంతం నీటమునిగింది. పెదపూడి, శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడగా, ఆ శాఖ ఏఈ రమేష్ నేతృత్వంలోని సిబ్బంది విద్యుత్‌ను పునరుద్ధరించారు. పెదపూడి, కొండవరం, వేములమడ, పెదముత్తేవి, యద్దనపూడి గ్రామాల్లోని కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది.

నందివాడ : గ్రామాల్లో సైడ్ డ్రెయినేజీలు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కొద్దిపాటి వర్షానికే రహదారిపై నీళ్లు రావటంతో బాటసారులు , వాహనదారులు రాకపోకల సమయాల్లో నానా అవస్థలు పడుతున్నారు. నందివాడ, జనార్థనపురం, తుమ్మలపల్లి, కుదరవల్లి,



పోలుకొండలో నీటమునిగిన రోడ్లు



కూచిపూడిలో నీటమునిగిన బస్టాండ్ ప్రాంతం

తమిరిశ, పలు గ్రామాల్లో రోడ్లకు సైడు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం పడితే నీళ్లన్నీ రోడ్ల మీదే వరదలా ప్రవహిస్తున్నాయి. దీంతో ఎక్కడ గొయ్యి ఉందో ఎవరికి అర్థం కాక నిత్యం రోడ్డు ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ సందర్భంగా పోలుకొండ గ్రామస్థులు మీగడ రాధాకృష్ణ, గుత్తికొండ నాని మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ పనులు మాత్రమే చేపడుతున్నారని, రోడ్లు, డ్రెనేజీలు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో పూడిక తీయకపోతే వర్షాకాలంలో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో రోడ్లు చూస్తే అర్థమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లోని రోడ్ల వెంబడి ఉన్న సైడు డ్రెయిన్లు తీసే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సబ్సిడీపై పశుదాణా పంపిణీ

గుడివాడ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): బొమ్ములూరులో పశువుల దాణాను రైతులకు మంగళవారం మండల పశువైద్యాధికారి ఉన్నం హనుమంతరావు పంపిణీ చేశారు. 50 శాతం సబ్సిడీపై రూ.555లకు దాణా కట్టా అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శొంఠి నాగేశ్వరరావు, బొమ్ములూరు, రామన్నపూడి, సీపూడి రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ మండలానికి 263 బ్యాగులు వచ్చాయని, వాటిని రైతులకు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు 50 శాతం సబ్సిడీ పోనూ మిగిలిన నగదు జమ చేసి కొనుగోలు చేయాలని ఆయన పేర్కొన్నారు.

లింగ వివక్ష, అసమానతలపై అవగాహన

నందివాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా నందివాడ అంగన్వాడీ కేంద్రం వద్ద సూపర్ వైజర్ నాగ శిరీష ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల లింగ వివక్ష , అసమానతలు, గురించి అవగాహన కల్పించారు. అంగన్వాడీ హెల్పర్స్, మహిళా పోలీసు లక్ష్మీ సామ్రాజ్యం, గ్రామస్థులు పాల్గొన్నారు.

పామర్రు: పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య జాగ్రత్తల పట్ల చిన్నతనం నుంచే అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీయూపీ ఉపాధ్యాయురాలు పి.పద్మావతి అన్నారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం చిన్నారులకు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ కాలుష్యం వల్ల కలిగే అనార్థలను ఆమె వివరించారు. గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ధర్నా



నూజెళ్లలో ధర్నా చేస్తున్న గ్రామస్థులు

గుడివాడ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నా పట్టించుకోకపోవటంతో నూజెళ్ల గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. తమ సమస్యను పరిష్కరించాలని లైన్‌మెన్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు ధర్నా విరమించేది లేదని స్పష్టం చేశారు.

గుడ్లవల్లేరు : విద్యుత్ కోతలను నివారించాలని కోరుతూ అంగలూరులో మహిళలు రోడెక్కి రాస్తారోకో చేశారు. అంగలూరు గాంధీ ఆశ్రమం రోడ్డులో రోడ్డుకు అడ్డంగా చెట్లకమ్మలు వేసి ఆప్రాంత మహిళలంతా రోడ్డుపై బైటాయించారు. దాదాపు రెండు గంటలపాటు రహదారిలో ట్రాఫిక్ నిలిచిపోయింది. గుడ్లవల్లేరు పోలీసులు రంగప్రవేశం చేసి బైటాయించిన మహిళలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కౌతవరం సబ్‌స్టేషన్ ఇన్‌చార్జ్ జేఈ వరకుమార్, గుడివాడ డీఈఈ పి.కిరణ్‌కుమార్‌లు ఆప్రాంతానికి వచ్చారు. లైన్‌మెన్ బి.గోపాలకృష్ణను అడిగితే మహిళలు అనికూడా చూడకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల ఏర్పడుతున్న సమస్యలు రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. లైన్‌మెన్ పై చర్యలు చేపడతామని మహిళలకు నచ్చజెప్పి ఆందోళనను డీఈఈ, జేఈలు విరమింపచేశారు.



అంగలూరులో ధర్నా చేస్తున్న మహిళలు

కోతుల బెడదను నివారించాలి



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్థులు

కూచిపూడి, మే 20 (ఆంధ్రజ్యోతి): గతేడాది నుంచి గుంపులు గుంపులుగా వందలాది కోతులు కంటి మీద కునుకు లేకుండా చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని చినముత్తేవి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడదను నివారించాలని కోరుతూ చినముత్తేవి గ్రామస్థులు, ప్రజా సంఘాల నేతలు మంగళవారం గ్రామసచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇంటిలోని వస్తువులు చిందరవందర చేయటంతోపాటు పంటలను నాశనం చేస్తూ పండ్ల మొక్కలు, కూరగాయల మొక్కలను ధ్వంసం చేస్తూ తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయంగా ఉందని వారు వాపోతున్నారు. గ్రామాన్ని విడిచి ఒకటి, రెండు రోజులు బయటికి వెళ్లి వచ్చే సరికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయన్నారు. అనంతరం గ్రామపంచాయతీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శీలం నారాయణరావు, మాదాసు నాగులు, మల్లిక, వెంకటేశ్వరమ్మ, రంగమ్మ, సుబ్బలక్ష్మీ, మణి, నాగేశ్వరమ్మ, జయలక్ష్మీ, జోగి బాలకృష్ణ, వీరవసంతరావు, పులి రాముడు, నాగ నాంచారయ్య, వీరబాబు పాల్గొన్నారు.



ఇళ్ల వద్ద గుంపులుగా సంచరిస్తున్న కోతులు

సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటా : ఎమ్మెల్యే

గుడివాడ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): దొండపాడు గ్రామసర్పంచ్ దివంగత చోరగుడి సురేఖ ప్రమాదవశాత్తు మరణించటం బాధాకరమని, సోదరి సురేఖ కుటుంబసభ్యులకు పార్టీ తరపునే కాకుండా వ్యక్తిగతంగా అండగా ఉంటానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. దొండపాడు గ్రామసర్పంచ్ కుటుంబసభ్యులను మంగళవారం సాయంత్రం గ్రామంలోని ఆమె స్వగృహంలో పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే పరామర్శించారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షులు వాసే మురళీ, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జోన్స్ దయానంద్, దొండపాడు గ్రామ వైస్ సర్పంచ్ శ్రీను, టీడీపీ నాయకులు సుధాకర్, వెంకటేశ్వరరావు, శివరావు, వెంకటరావు, రాజారావు, వల్లూరి అబ్బులు, పాపయ్య శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



కుటుంబసభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కూచిపూడి, మే 20 (ఆంధ్రజ్యోతి): పెడసనగల్లులోని లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు రోజున సుప్రభాత సేవ, నిత్యార్చన, నిత్యహోమం, బలిహరణ, వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, గ్రామోత్సవం, పవళింపు సేవా కార్యక్రమాలను వేదపండితులు దీవి ఉదయ కుమార్, అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

తోట్లవల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్అండ్‌బీకి చెందిన రెండు సెంట్ల స్థలంలో ఓ వ్యక్తి నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆర్ఎస్ నెం 59లో 896 చదరపు అడుగుల ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి ఆర్‌సీసీ భవనం నిర్మాణం చేశాడు. రెవెన్యూ అధికారుల ఆదేశంతో శ్రీనివాసరెడ్డికి నోటీసులు జారీ చేసినట్టు పంచాయతీ కార్యదర్శి నాగుల్‌మీరా తెలిపారు. నోటీసులకు శ్రీనివాసరెడ్డి స్పందించకపోవటంతో మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారుల సమక్షంలో ఎక్సకవేటర్‌తో సదరు అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



యాకమూరులో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

హరినారాయణపురంలో చోరీ

గుడివాడ, మే 20(ఆంధ్రజ్యోతి) : తాపీ పని చేసుకునే మహిళ ఇంట్లో చోరీ జరిగింది. స్థానిక హరినారాయణపురానికి చెందిన ఎం.లక్ష్మీ తాపీపని నిమిత్తం సోమవారం ఉదయం ఇంటికి తాళాలు వేసి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో ఉన్న రూ.31వేల నగదు చోరీకి గురైనట్టు బాధితురాలు లక్ష్మీ వాపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ ఎస్సై జాస్మిన్ తెలిపారు.

వృద్ధాశ్రమంలో భోజన వసతి

గుడివాడ : విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలూరు సత్యనారాయణ కోడలు దుర్గాభవాని జన్మదినం సందర్భంగా స్థానిక శాంతి వృద్ధాశ్రమంలో మానవతా స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు భోజన వసతి కల్పించారు. శివకృష్ణ, సంఘం జిల్లా నాయకులు భవిరి శంకరనాథ్, గాయత్రి మహిళ సంఘం అధ్యక్షురాలు చింతలూరు ఉమాదేవి, మానవతా స్వచ్ఛంధ సంస్థ సభ్యులు సీతారామస్వామి, రాధాకృష్ణ, గంగాధర్‌రావు, పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



గుడివాడలో ..

గుడివాడ, మే 20(ఆంధ్రజ్యోతి) : కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, గూడపాటి ప్రకాష్‌బాబులు డిమాండ్ చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్మిక సంఘాల నాయకులు సి.హెచ్ శివనాగమల్లేశ్వరరావు, కొండ, సత్యనారాయణ, సురేష్, పి.రజిని, ఆదిలక్ష్మీ, కృష్ణకుమారి, భవాని, పాల్గొన్నారు.

గుడివాడ : అఖిల భారత కార్మిక సమ్మెను ఏకపక్షంగా వాయిదా వేయడం దారుణమని శ్రామిక హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు ఆర్.రఘు అన్నారు. ది ఇండస్ట్రీయల్ వర్కర్స్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్, శ్రామిక హక్కుల పోరాట సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆటో నగర్‌లోసమ్మెను నిర్వహించారు. అనంతరం ఆటోనగర్ నుంచి 200 బైకులపై ఆర్డీవో కార్యాలయం వరకు బారీ ర్యాలీ నిర్వహించారు. ది ఇండస్ట్రీయల్ వర్కర్స్ అండ్‌ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.లక్ష్మణరావు, అబ్దుల్ ఖుద్దూస్, ఆంజనేయులు, త్రినాథ్, విజయ్‌కుమార్, వీర్రాజు, మొహిద్దీన్, వెంకటరమణ పాల్గొన్నారు.



కూచిపూడిలో..



ర్యాలీలో పాల్గొన్న శ్రామిక హక్కుల పోరాట సంఘం నాయకులు, ఆటోనగర్ కార్మికులు

కూచిపూడి : కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావటాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో మొవ్వ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కాకి రాజశేఖర్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కొడాలి శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల వైస్ ప్రెసిడెంట్ ఏనుగు శ్రీనివాసరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు దేవామణి, మధ్యాహ్న భోజనకార్మిక సంఘం నాయకురాలు పెదముత్తేవి రాణి, ఎస్తేరు రాణి, కాటా ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శీలం కాటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కొడాలి కరుణాకర్ పాల్గొన్నారు.

పమిడిముక్కల : కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని, చాలీ చాలని జీతాలు, వేతనాలతో ఆశా వర్కర్లు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోసూరు శివనాగేంద్రం ఆరోపించారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించి, కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో వీరంకిలాకు సెంటర్‌లో ఆశావర్కర్లు, కార్మిక సంఘాలు, ప్రజా సం ఘాలు మంగళవారం ధర్నా చేశారు. ఆశావర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు హేమలత, బిల్డింగ్‌వర్కర్స్ యూనియన్ నేత ఖాన్, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: కార్మిక సమ్మెలో భాగంగా మంగళవారం తోట్లవల్లూరులో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి రంగారావు మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నినాదాలు చేస్తూ సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎం. కుసుమకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్మిక సంఘాల నేతలు కె కొండలబాబు, జె ఏసేబు, ఈడ్పుగంటి డేవిడ్‌రాజు, సీహెచ్ వెంకట సుబ్బారావు, అంబటి శ్రీనివాసరావు, వి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

పామర్రు : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు తక్షణమే విడనాడలని పామర్రు నియోజకవర్గ సీఐటీయూ కార్యదర్శి ఓడుగు గంగాధర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం కనీస వేతనం రూ26వేలు కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికుల చేల్లించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే కార్మికులు జరిపే సమ్మెను జయప్రదం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వేము పెదబాబు, కాటూరి నాగభూషణం, శివనాగు, ఉమారాణి పాల్గొన్నారు.



పామర్రు నాలుగు రోడ్ల కూడలిలో ధర్నాచేస్తున్న కార్మికులు



తోట్లవల్లూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535



మినీ మహానాడు నేడు

మచిలీపట్నం టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సుల్తానగరంలో బుధవారం జరగనున్న నియోజకవర్గ మినీ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మంగళవారం శిడింబి అగ్రహారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీమహానాడు టీడీపీ కుటుంబ సభ్యులకు ఒక పండుగలాంటిదన్నారు. నియోజకవర్గాల్లో చేసిన తీర్మానాలు జిల్లాస్థాయిలో ఈనెల 23న సత్య కన్వెన్షన్ హాలులో జరిగే జిల్లా స్థాయి మినీ మహానాడులో చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.వి. ఫణికుమార్, ఐ. దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

డాబాపై నుంచి పడి ఒకరి మృతి

పెడన, మే 20 (ఆంధ్రజ్యోతి) : డాబాపై నుంచి కిందకు దిగుతూ ప్రమాదవశాత్తూ కిందపడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన పెడన మండలం కవిపురంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కవిపురానికి చెందిన పుప్పాల మాణిక్యాలరావు (67) తన భార్య వీరకుమారితో కలసి సోమవారం రాత్రి తన డాబాపై నిద్రపోయాడు. మంగళవారం తెల్లవారుజామున వర్షం పడటంతో ఇరువురు కిందకు దిగుతున్న సమయంలో మాణిక్యాలరావు ప్రమాదవశాత్తూ కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో కిందనున్న పిల్లర్లు, ఊసలు మాణిక్యాలరావు ఛాతిలో బలంగా గుచ్చుకున్నాయి. భార్య వీరకుమారి చుట్టుపక్కల వారి సాయంతో బందరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మాణిక్యాలరావు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మాణిక్యాలరావు చిన్నకుమారుడు బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హనుమాన్ చాలీసా పారాయణం

అవనిగడ్డ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపాలెంలో కోదండ రామాలయంలో ప్రతి రోజు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నారు. అవధూతేంద్ర భక్త మండలి భజన సమాజం ఆధ్వర్యంలో ఈ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నారు. మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

అవనిగడ్డలో వేడుకలు రేపు

అవనిగడ్డ : స్థానిక సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి (గాలిగోపురం) ఆలయంలో వైశాఖ బహుళ దశమి గురువారం పర్వదినాన్ని పురస్కరించుకుని 22వ తేదీన హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. ధర్మకర్త పోతరాజు భాస్కరరావు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించనున్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

కృత్తివెన్ను, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. నీలిపూడిలోని పశువైద్యశాలలో సబ్సిడీ పశుదాణా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పాడి రైతుల కోసం 50 శాతం రాయితీపై పశువులకు ఎంతో పోషక విలువలను అందించే దాణాను అందిస్తున్నట్టు తెలిపారు. 50 కేజీల దాణా రూ. 1,110 ధర ఉండగా, 50 శాతం రాయితీపై రూ.555 అందిస్తున్నామన్నారు. మండలానికి 16.3 టన్నుల దాణాను పాడి రైతుల కోసం అందుబాటులో ఉంచామన్నారు. నీలిపూడి, నిడమర్రులో ఈ దాణా నిల్వ ఉంచామని, ప్రతి రైతుకు 50 కేజీల చొప్పున తొలివిడతగా ఇస్తున్నామన్నారు. డిమాండ్‌ను బట్టి మరో 50 కేజీలు అందించే ఆలోచనతో పాటు మరో రెండు విడతలుగా దాణా దిగుమతి అవుతుందన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నీలిపూడి గ్రామంలో 5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, డిసి చైర్మన్ నెక్కంటి భాస్కరరావు, సర్పంచ్ పాశం కృష్ణ, కూనసాని చిన్న, యాదంరెడ్డి కొండ, మాజీ ఎమ్‌పిపి వలవల సత్యనారాయణ, తిరుమాని రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నీలిపూడిలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో మంత్రి రవీంద్ర

మోపిదేవి, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో ఆయనను సత్కరించారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలు మంత్రికి అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, రావి రత్నగిరి, విస్సంశెట్టి రాజా ఆయన వెంట ఉన్నారు.



మంత్రి రవీంద్రకు ప్రసాదం అందిస్తున్న ఆలయ ఈవో శ్రీరామ వర ప్రసాదరావు

శివరామక్షేత్ర పునర్నిర్మాణానికి విరాళం

కోడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): కోడూరులోని శివరామకృష్ణ క్షేత్రం పునర్నిర్మాణంలో భాగంగా భారీ బడ్జెట్‌తో పూర్తిగా గ్రానైట్‌తో నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి కొల్లూరు రామకృష్ణ - ప్రసన్న దంపతులు రూ.1,01,116లు విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశాఆరు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయం అందించటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్ బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్ బడే భావన్నారాయణ, ఉల్లి రంగారావు, అన్నం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

చల్లపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం చల్లపల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎన్టీఆర్ చిత్రాలతో కూడిన జెండాలను చేతబట్టుకుని ర్యాలీ చేశారు. స్థానిక సాగర్ థియేటర్‌లో యమదొంగ సినిమా ప్రదర్శన సందర్భంగా కేక్ కట్‌చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు కేక్ కట్‌చేయగా, కళాకారుడు బోలెం రామారావు పెద్ద ఎన్టీఆర్ వేషధారణలో అలరించారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ తదితరులు పాల్గొన్నారు. ముమ్మనేని సన్నీ, ఉప్పాలస్వామి, ప్రమోద్ తారక్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

సామాన్యుల సమస్యలు పరిష్కరించాలి

అధికారులతో జేసీ గీతాంజలి శర్మ



మచిలీపట్నం టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సామాన్యుల సమస్యలను ఓర్పుతో విని పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ , జెసి గీతాంజలి శర్మ అన్నారు. సీయం కార్యాలయ చీఫ్ గ్రీవెన్సు అధికారి చిన్నారావు అధికారులతో జూమ్ యాప్‌లో మాట్లాడారు. అనంతరం జెసి అధికారులతో మాట్లాడారు. మీకోసంలో అర్జీలు ప్రజలు సంతృప్తి చెందే విధంగా పరిష్కార మార్గం చూపాలన్నారు. జిల్లాలో ఉంగుటూరు, గూడూరు మండాలాల్లో ప్రజల సంతృప్తి స్థాయి బాగుందన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి పనితీరు బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో పార్వతి, ఐసీడీఎస్ పీడీ వాణి, జడ్పీ సీఈవో ఆనందకుమార్, పౌరసరఫరాల సంస్థ డీఎం శిరీష, డీఆర్‌డీఏ పీడీ హరనాథ్, కేఆర్‌ఆర్‌సీఎస్‌డీసీఎస్‌డీసీ నోడల్ అధికారి శ్రీదేవి, మున్సిపల్ కమిషనరు బాపిరాజు, డీఈవో రామారావు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలి

తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలంటూ జేసీ, కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ గీతాంజలి శర్మకు మంగళవారం సీఐటీయూ నాయకులు జయరావు తదితరులు వినతిపత్రం సమర్పించారు. తొమ్మిదేళ్ళుగా రాష్ట్ర వ్యాప్తంగా 500 మంది వ్యాన్ డ్రైవర్లు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. వైద్యరంగంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని, వీరికి రూ. 8800 మాత్రమే జీతం చెల్లిస్తున్నారన్నారు. నాయకులు సీతారామ్, శివసాయికుమార్, విజయరాజు, ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలరావు

హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి

రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు

పెడన, మే 20 (ఆంధ్రజ్యోతి) : పెడన హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. పెడన హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై చర్చించేందుకు పట్టణంలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బళ్ల ప్రసాద్ అధ్యక్షతన పురప్రముఖులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కోసం జరిగిన ప్రయత్నాలను వివరించారు. స్మశాన వాటిక అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరిలను కలసి విజ్ఞప్తి చేశామన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సమక్షంలో స్మశాన వాటిక అభివృద్ధికి రూ. 5.14 కోట్లతో అంచనాలు రూపొందించి ఎంపీ బాలశౌరి ద్వారా నిధులు తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో ఊటుకూరి శివప్రసాదరావు, యక్కల శ్యామలయ్య, ఊటుకూరి సూర్యప్రకాశరావు, కమ్మగంటి బాబు, వాసా సాంబశివరావు, భట్టు చంద్రరావు, తమ్మా బీమయ్య, కొసనం లోకనాథం, ఉట్ల మహదేవమూర్తి పాల్గొన్నారు.

మచిలీపట్నంలో ర్యాలీ నేడు

మచిలీపట్నం టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీ వస్తున్నారని, ఆ సందర్భంగా రాష్ట్రమంతటా కోటి మందితో యోగాప్రదర్శనలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని డీఆర్వో కె. చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం డీఆర్వో చాంబర్‌లో యోగా మాస్టర్లు, అధికారులతో ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు బుధవారం జిల్లా కోర్టుసెంటర్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో 150 మందితో ఒక యోగశిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో యోగా ట్రైనర్స్‌ను గుర్తించామని, ఆ యోగాట్రైనర్స్‌తో మూడు రోజుల పాటు మండల స్థాయి రిసోర్స్‌పర్సన్‌కు శిక్షణ ఇస్తామన్నారు. ఆ తరువాత మండల స్థాయి రిసోర్సు పర్సన్లు వివిధ గ్రామాల్లోని యోగ శిక్షకులకు శిక్షణ ఇస్తారన్నారు. నెల రోజుల పాటు గ్రామ, మండల, నియోజకవర్గస్థాయిలో ఇచ్చే శిక్షణా తరతుల్లో నేర్పించే అంశాలపై ఆఫ్‌లైన్‌లోనే కాకుండా ఆన్‌లైన్‌లో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, అయూష్ ప్రతినిధులు జగత్‌ఖాన్, యోగాగురువులు శిరీష, గురునాథబాబు, ఆర్‌డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ ఝాన్సీలక్ష్మి, పి.వి. ఫణికుమార్‌లు చర్చించారు. బుధవారం ఉదయం జరిగే కార్యక్రమాల్లో మంత్రి కొల్లు రవీంద్ర, జేసీ గీతాంజలి శర్మ పాల్గొంటారన్నారు.

భారీ వర్షంతో రహదారులు జలమయం

మోపిదేవి, మే 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం వల్ల మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు మెరుపులతో రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో మండలంలోని పలు గ్రామాల ప్రధాన, అంతర్గత రహదారులు జలమయం అయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో రహదారులు నీటితో నిండాయి. మోపిదేవి ప్రధాన రహదారి బస్టాండ్ వద్ద, పంచాయతీ కార్యాలయం వద్ద, అవనిగడ్డ వెళ్లే రహదారి వెంబడి మోకాళ్లలోతు నీరు నిల్వ ఉండటంతో ప్రయాణీకులు, గ్రామస్థులు ఇబ్బంది పడ్డారు.

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డకు కూతవేటు దూరంలో ఉన్న అశ్వారావుపాలెంలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రహదారులు చిత్తడిగా మారాయి. ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నాగాయలంక : ఉరుములు మెరుపులతో నాగాయలంకలో భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షపాతం 50.8 మీమీగా నమోదు అయింది. తిప్పపాలెం, బోసుబొమ్మ సెంటర్‌లోని రహదారిపై వర్షపు నీరు నిలిచింది. భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తక్షణమే సిబ్బంది వచ్చి పునరుద్ధరించారు.

అవనిగడ : ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి అవనిగడ్డలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం, కోర్టు సెంటర్, అవనిగడ్డలోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. 57.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు.



అవనిగడ్డలో జలమయంగా మారిన ప్రధాన రహదారి

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

పెడన రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా రేషన్ కార్డులు కావలసినవారికి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోగల అన్ని సచివాలయాలలో నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తాహసీల్దార్ కె అనిల్‌కుమార్ తెలిపారు. చనిపోయినవారి పేర్లను తొలగించేందుకు డెత్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. పుట్టిన వారిపేర్లు నమోదుకు బర్త్ సర్టిఫికెట్ జతచేయాలన్నారు. ప్రస్తుతం జరిగే మార్పులు,చేర్పులు, తొలగింపుల ప్రక్రియను అవసరమైనవారు వినుయోగించుకోవాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే దగ్గరలోని సచివాలయంలో సంప్రదించాలన్నారు.

పకడ్బందీగా ఏపీ ఈఏపసెట్

పెడన రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీఈఏపసెట్ 2025 పరీక్షలు పకడ్బందీగా జరిగాయి. ఉదయం 80 మంది విద్యార్థులకు 76 మంది, మధ్యాహ్నం 82 మంది విద్యార్థులకు 75 మంది పరీక్షలకు హజరయ్యారని ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి తెలిపారు.



టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన న్యాయవాది కూనపరెడ్డి శ్రీనివాసరావు

టంగుటూరి ధైర్య సాహసాలు అందరికీ ఆదర్శం

మచిలీపట్నం టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : బ్రిటిషువారి తుపాకి గుళ్లకు తన గుండెను చూపించి రండిరా.. కాల్చుకోండిరా.. అని తుపాకులకు ఎదురెళ్లిన ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు ధైర్య సాహసాలు అందరికీ ఆదర్శమని ప్రముఖ న్యాయవాది కూనపరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా స్థానిక చల్లరస్తా సెంటర్‌లో జరిగిన సమావేశంలో కూటమి నాయకులు పివి.ఫణికుమార్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, హరికృష్ణ తదితరులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అవనిగడ్డ: విలువలు కలిగిన నాయకుడు టంగుటూరు ప్రకాశం పంతులు అని ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం అవనిగడ్డ టీడీపీ కార్యాలయంలో టంగుటూరు ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాచవరపు ఆదినారాయణ, బండే రాఘవ, మాదివాడ రత్నారావు, కొండవీటి గోవింద్, గుంటూరు వినయ్, మెగావత్తు గోపి, బచ్చు రాఘవయ్య, పైడిపాముల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై. నరసింహారావు

మచిలీపట్నం టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పోరాటాలతోనే కార్మికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై. నరసింహారావు పేర్కొన్నారు. పేదలకు వ్యతిరేకంగా రూపొందించిన కొత్త చట్టాలను అమలు చేయవద్దంటూ మంగళవారం కోనేరుసెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి. సుబ్రహ్మణ్యం, చిరువోలు జయరావు, ఏ.రమాదేవి, దాసరి కృపాజయ, కాశమ్మ, సిహెచ్. బుల్లెమ్మ, ఏఐటీయుసి నాయకులు వంటిపులి లక్ష్మణరావు, యర్రంశెట్టి ఈశ్వరరావు, మహమ్మద్ యూనస్, దోవారి విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ : సమ్మెకు సంఘీభావంగా అవనిగడ్డ బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు నిరసన ప్రదర్శన చేశాయి. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.పోలినాయుడు మాట్లాడుతూ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు ఏరియా నాయకురాలు ఏ.నాగమణి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అన్నపరెడ్డి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు యాసం శ్రీనివాసరావు, బండారు భూషయ్య, కార్పెంటర్ అసోసియేషన్ నాయకులు నాంచారయ్య, ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

చల్లపలి : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం వామపక్ష, కార్మిక సంఘాల నేతలు, కార్మికులు చల్లపల్లి ప్రధాన సెంటర్లో నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లానేత జన్ను జగన్, సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, వ్యకాస అధ్యక్షుడు మేడేపల్లి వెంకటేశ్వరరావు, వృత్తిసంఘం జిల్లా నేత వాకా రామచంద్రరావు, తలారి నాగేశ్వరరావు, చల్లపల్లి గంగాభవానీ, మాచారం ఆదినారాయణ, వెనిగళ్ల వసంతరావు, గోళ్ల సాంబశివరావు, చోడాబత్తిన ఆదినారాయణ, అన్సారీలతోపాటు అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘంటసాల : కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఘంటసాల సత్రం సెంటర్‌లో సీఐటీయూ నేతలు నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల మండల నేతలు మేడంకి వెంకటేశ్వరరావు, గొరుముచ్చు వెంకటేశ్వరరావు, బలే పద్మ, పంచాయతీ కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

బంటుమిలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలపై మోపుతున్న ఆర్థిక భారాలకు నిరసనగా జూలై 9 వతేదీన చేపట్టిన భారతదేశ సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలంటూ బంటుమిల్లి పుర వీధులలో ప్రదర్శన గావించారు. ఈ కార్యక్రమంలో మాజేటి శివశ్రీనివాసరావు, ధనశ్రీ, గౌరిశెట్టి నాగేశ్వరరావు, అజయ్‌ఘోష్, రత్నకుమారి, కొమ్మాలపాటి రవి, బాజీ, వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి, రఫీ, రజినీ, వెంకటేశ్వరమ్మ, కృష్ణ, చంద్రశేఖర్, పొదిలి వెంకన్న పాల్గొన్నారు.

పెడన : తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన బంటుమిల్లి రోడ్డు సెంటర్ వరకు కొనసాగింది. కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని, పనిభారం తగ్గించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రదర్శనలో పాల్గొన్న ఆశ వర్కర్లు నినాదాలు చేశారు. ఈ పరుచూరి ధనశ్రీ, పంచల నరసింహారావు, గోరు రాజులు పాల్గొన్నారు.



కోనేరుసెంటర్‌లో ర్యాలీని ప్రారంభించిన సీపీఎం నాయకులు





చల్లపల్లి ప్రధాన సెంటర్లో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష, కార్మిక సంఘాల నేతలు.. బంటుమిల్లిలో..